
RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY　తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 89 ISSUE NO : 89 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | మంగళవారం, సెప్టెంబర్, 23, 2025 Tuesday, September, 23, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## 'సిందూర్' పార్ట్ 2..

## పాక్ తీరుపై ఆధారపడి ఉంటుంది

### కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఢిల్లీ,:ఉగ్రవాదులకు మద్దతిస్తోన్న పాకిస్థాన్‌కు సరిహద్దుల్లోనే కాకుండా.. వారి సొంతగడ్డపైనా గట్టిగా బుద్ధి చెప్పామన్నారు కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మొరాకో పర్యటనలో ఉన్న ఆయన.. అక్కడి ప్రవాస భారతీయులతో ముచ్చటించారు. ఈసందర్భంగా 'ఆపరేషన్ సిందూర్' విజయాలను పంచుకున్నా రు. 'సిందూర్ పార్ట్ 2' అనేది పాక్ తీరుపై ఆధారపడి ఉంటుందని దాయాదిని హెచ్చరించారు. "ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి మతం అడిగి మరీ మన పౌరులను చంపేశారు. మేం మతం చూసి వారిని (ఉగ్రవాదులను) మట్టుబెట్ట లేదు. వారు చేసిన పనులు చూసి చంపేశాం. పహల్గాం ఘటన జరిగిన తర్వాత త్రివిధ దళాల అధిపతులతో జరిగిన సమావేశంలో వారిని నేను ఒకే ప్రశ్న అడిగాను. ఒకవేళ ప్రభుత్వం ఆమోదం తెలిపితే.. ఆపరేషన్‌కు మీరు సిద్ధమా? అని ప్రశ్నించాను. వారు నిమిషం ఆలస్యం చేయకుండా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దీంతో మేం ప్రధాని మోదీని కలిస్తే.. ఆయన సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు" అని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. "ఆ తర్వాత ఏం జరిగిందో ప్రపంచమంతా చూసింది. కేవలం సరిహద్దుల్లోనే కాదు.. దాయాది భూభాగంలో 100 కిలోమీటర్ల లోపలికి వెళ్లి మరీ ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేశాం.



## సింగరేణి కార్మికులకు భారీ గుడ్ న్యూస్

## పండగ బోనస్ ప్రకటించిన తెలంగాణ సర్కార్

**హైదరాబాద్, సెప్టెంబర్, 22, తెలంగాణ దిశ :** సింగరేణి కార్మికులకు తెలంగాణ సర్కార్ భారీ గుడ్ న్యూస్ చెప్పింది. దసరా పండగను పురస్కరించుకుని కార్మికులకు బోనస్ ప్రకటించింది. ఈ ఏడాది సింగరేణికి వచ్చిన రూ.2,360 కోట్ల లాభాల్లో 34 శాతం వాటా అంటే రూ.810 కోట్లు కార్మికులకు బోనస్ ప్రకటించింది తెలంగాణ ప్రభుత్వం. ఇందులో రెగ్యులర్ కార్మి కులకు లక్షా 95 వేల 610 రూపాయలు (1, 95, 610), కాంట్రాక్ట్ వర్కర్స్‌కు రూ.5 వేల 500 బోనస్‌గా అందించనుంది ప్రభుత్వం. పండగ బోనస్ ప్రకటించడంతో సింగరేణి కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సింగరేణి సంస్థ మొత్తం రూ.6,394 కోట్లు గడించగా.. ఇందులో సంస్థ విస్తరణ ఖర్చులు, ఇతర ఖర్చులు పోను రూ.2,360 కోట్లు లాభంగా తేలిందని చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. రూ.2,360 కోట్ల లాభాల్లో మొత్తం 71 వేల మంది కార్మికులకు రూ.819 కోట్లను ప్రభుత్వం దసరా బోనస్ కింద పంపిణీ చేయనుందని తెలిపారు. తెలంగాణ సచివాలయంలో సోమవారం (సెప్టెంబర్ 22) జరిగిన సింగరేణి కార్మికులకు వాటా పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..



## దేశవ్యాప్తంగా జీఎస్టీ సేవింగ్ ఫెస్టివల్ మొదలైంది

### దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ లేఖ..!

ఢిల్లీ,:జీఎస్టీ సేవింగ్ ఫెస్టివల్‌పై ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. జీఎస్టీ సంస్కరణలు ప్రస్తుతం వాటి ప్రభావాన్ని చూపిస్తున్నాయని.. దేశవ్యాప్తంగా 'జీఎస్టీ సేవింగ్ ఫెస్టివల్' ప్రారంభమైందని ప్రధానమంత్రి లేఖలో పేర్కొన్నారు. ఈ సంస్కరణలు ప్రజల పొదుపును పెంచుతాయని.. సమాజంలోని ప్రతి విభాగానికి ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తాయని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు వృద్ధి, పెట్టుబడులను పెంచుతాయని.. ప్రతి రాష్ట్రం, పురోగతిని వేగవంతం చేస్తాయన్నారు.



## నేడు మేడారం సందర్శనకు సీఎం రాక

### ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క

**ములుగు, సెప్టెంబర్, 22, తెలంగాణ దిశ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మేడారం సందర్శించనున్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో పంచాయితి రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ తల్లులను మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎస్పి షబరిష్ లతో కలిసి దర్శించుకున్నారు. మంగళవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమ్మక్క సారలమ్మ దేవాలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో పర్యాటక పనులను మంత్రి సీతక్క పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, దిశా నిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఎ ఎస్ పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ- చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్ డిఒ వెంకటేష్, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గరావు, ఇఒ వీరస్వామి, ఎ పి ఓ వసంత రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. సిఎం రేవంత్ పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు భారీ ఏర్పాట్లు- చేస్తున్నారు.



## బాసరలో ఘనంగా శరన్నవరాత్రులు

**నిర్మల్, సెప్టెంబర్, 22, తెలంగాణ దిశ :** ప్రముఖ పుణ్యక్షేత్రం బాసరలో దేవీ శరన్నవరాత్రులు సోమవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. తొలిరోజు అమ్మవారు శైలపుత్రిగా దర్శనమిచ్చారు. చదువు లతల్లి సరస్వతి దేవీ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం సందర్బంగా అక్షరాభ్యాసాలు కూడా జోరుగా సాగాయి.



## తెలంగాణ సాధనలో సింగరేణిది ప్రత్యేక పాత్ర

### బొగ్గు ఉత్పత్తిని ఆపి నాటి ప్రభుత్వంపై ఒత్తిడి

### బోనస్ ప్రకటన సందర్భంగా సిఎం వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్, 22, తెలంగాణ దిశ :** తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికులు ప్రత్యేక పాత్ర పోషించారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సింగరేణి కార్మికుల భాగస్వామ్యాన్ని ప్రభుత్వం ఎప్పటికి గుర్తుంచుకుంటుందని అన్నారు. సింగరేణి కార్మికులకు గుడ్ న్యూస్ చెప్పింది ప్రభుత్వం. దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించింది సర్కార్. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మూతపడుతుందన్న దశలో సింగరేణిని కాకా వెంకటస్వామి ఆదుకున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో బొగ్గు ఉత్పత్తి మొత్తని స్తంభింప చేసి అప్పటి ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చినట్లు గుర్తు చేశారు.




## సీబీఐకి ఫోన్ ట్యాపింగ్ కేసు

**హైదరాబాద్, సెప్టెంబర్, 22, తెలంగాణ దిశ :** తెలంగాణ రాజకీయాల్లో ఏం జరగబోతోంది? ఫోన్ ట్యాపింగ్ కేసు ఎంతవరకు వచ్చింది? మూడు అడుగులు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అన్నచందంగా మారిందా? ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చెయ్యబోతోంది? ఈ కేసును సీబీఐకి ఇవ్వనుందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. తెలంగాణ నుంచి సీబీఐకి మరో కేసు బదిలీ కానుందా? ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించే యోచనలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసుపై ఇప్పటికే విచారణ చేపట్టి కీలక ఆధారాలు సేకరించింది సిట్. సీబీఐ రంగంలోకి దిగితే వేగంగా దర్యాప్తు జరగడం ఖాయమని అధికారులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిట్ విచారణ చేయడంతో అధికారులు సహకరించలేదని, అదే సీబీఐ అయితే కచ్చితంగా ఈ కేసు కొలిక్కి వస్తుందని అంటున్నారు. దీనిపై ఈ వారం లేకుంటే వచ్చేవారంలో ప్రభుత్వ నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అదే జరిగితే అప్పటి ప్రభుత్వ పెద్దలకు కష్టాలు తప్పవని అంటున్నారు. ఇందుకు కారణాలు లేకపోలేదు. ఈ వ్యవహారంలో జడ్జిలు, రాజకీయ నేతలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల ఫోన్లు ట్యాప్ అయ్యాయి. చాలామంది సిట్ ముందుకు వచ్చి చెప్పాల్సినవన్నీ చెప్పారు. ఇప్పుడు ఏం చేసినా రాష్ట్ర ప్రభుత్వం కావాలని చేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఓపెన్ గా చెబుతున్నారు.



## ప్రారంభమైన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

### ఉత్సవాలకు సిద్ధమైన దేవీ ఆలయాలు విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

**ఖమ్మం,, తెలంగాణ దిశ :** ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమ య్యాయి. అశ్వీయుజ శుక్ల ప్రతిపద మొదలుకొని నవమి వరకు తొమ్మిది రాత్రులను నవరాత్రులుగా వ్యవహరిస్తారు. ఏడాది పొడవున వచ్చే నవరాత్రి ఉత్సవాలలో దేవీ నవరాత్రి ఉత్సవాలను ప్రత్యేకంగా మహిళలు భావిస్తారు. ఆశ్వయుజ పాడ్యమి నుంచి ప్రారంభమయ్యే దేవినవరాత్రి ఉత్సవాలు విజయదశమి వరకు జరుగుతాయి. హిందూ సంప్రదా యంలో శక్తి స్వరూపిణి అయిన పార్వతీ అవతారాలలో నవదుర్గ అవతారాలను ముఖ్యమైనవిగా భావిస్తారు. ఆ తల్లి బ్రహ్మ, విష్ణు, శివ అంశలతో మహాసరస్వతి, మహాలక్ష్మి, మహంకాళిగా అవతరించినట్లు పురాణకథ చెబుతున్నది. ప్రతీ అవతారం నుంచి మరొక రెండు రూపాలు వెలువడి మొత్తం తొమ్మిది రూపాలలో నవ దుర్గలుగా భావి స్తారు. మహిళలు, పురుషులు ఈ తొమ్మిది రోజుల పాటు కఠోర ఉపవా స దీక్షలు, నియమనిబంధనలు పాటిస్తూ అమ్మవారిని కొలుస్తారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నియోజకవర్గ పరిధిలోని కారేపల్లి, గ్రామాలలో నిర్వాహకులు మండపాలను ప్రత్యేక అలంకరణతో ముస్తాబు చేశారు.

# డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వకపోతే బుల్డోజర్‌కు అడ్డం పడుకుంటా : కల్వకుంట్ల కవిత







**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22, (తెలంగాణ దిశ)** :గాజుల రామారం బాధితులకు అక్టోబర్ ఆరులోగా డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వని పక్షంలో బుల్డోజర్‌కు అడ్డం పడుకుంటానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం గాజుల రామారం బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుల గోడు విన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హైడ్రా కూల్చివేతల బాధితులు సుమారు 200 మంది ఉన్నారని అన్నారు. అందరి జాబితాతో అవసరమైతే హైడ్రా కార్యాలయానికి లేదా ప్రజా భవన్ కు వస్తానని ఆమె అన్నారు. పెద్దోళ్ళు కబ్జాలు చేస్తే పట్టించుకోని ప్రభుత్వం పేదల పొట్ట కొట్టడం ఏమిటని నిలదీశారు. అక్టోబర్ ఆరవ తేదీ మళ్లీ వస్తామని హైడ్రా అధికారులు చెప్పారని స్థానికులు వివరించారు. దీంతో స్పందించిన కవిత అక్టోబర్ ఆరులోగా బాధితులకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. శని, ఆదివారాలలో ఎవరి జోలికి వెళ్ళవద్దని కోర్టు చెప్పినప్పటికీ అధికారులు వినడం లేదన్నారు. పండుగ పూట పేద ప్రజల ఉసురు పోసుకోవద్దని సూచించారు. బాధితుల ఒక్కో కుటుంబానికి రూ. 50 వేల నష్టపరిహారంతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని ఆమె కోరారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చేసిన 12 ఎకరాల భూమిని బయటికి తీయాలని ఆమె డిమాండ్ చేశారు. పేదలపై ప్రతాపం చూపడం సిగ్గుచేటు అన్నారు. పెద్దోళ్లను వదిలి పేదలపై ప్రతాపం చూపించడం ఏమిటని ప్రశ్నించారు. కోర్టు చెప్పినా సరే ఆదివారం ఇళ్లు కూల్చుతారా? అని నిలదీశారు. బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రూ. 50 వేలు సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మళ్లీ హైడ్రా బుల్డోజర్ వస్తే నేనే అడ్డుగా నిలుచుంటానని అన్నారు. అరెకపూడి గాంధీ కబ్జా చేసిన 12 ఎకరాల సంగతేమిటని...ఆమె ప్రశ్నించారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ కు వైఎస్ ప్రభుత్వంలో భూములు ఇచ్చారని, ఆనాడే కంచె వేసి ఉంటే ఈ భూములు కబ్జా అయ్యేవి కాదన్నారు. పోచమ్మ బస్తీ చుట్టు పక్కల ఉన్న దాదాపు 4వందల ఎకరాల్లో కబ్జాలకు గురయ్యాయన్నారు. చాలా ప్రభుత్వాలు మారినప్పటికీ భూముల రక్షణను పట్టించుకోలేదన్నారు. హైడ్రా హడావుడిగా వచ్చి పెద్ద వాళ్ల జోలికి పోకుండా... పేదల ఇళ్లను రాత్రికి రాత్రికి కూలగొట్టటం దారుణమన్నారు. చిన్నపిల్లలు ఉన్నారు. మరో పక్క పండుగ ఉంది. ఈ సమయంలో వారి ఇళ్లు కూలగొట్టటం అమానుమన్నారు. గతంలోనే కోర్టు శని, ఆదివారాలు ఎవరి జోలికి వెళ్లవద్దని స్పష్టంగా చెప్పిందన్నారు. వాళ్లకు న్యాయం కోసం కోర్టుకు వచ్చే అవకాశం ఇవ్వాలని కోరారు. అయినప్పటికీ ఆదివారం రోజు ఇళ్లను కూలగొట్టారని ఆమె విమర్శించారు. గ్యాస్ బిల్లు, కరెంట్ బిల్లు ఉన్న వాళ్ల ఇళ్లను కూడా కూలగొట్టారని అన్నారు. పిల్లలు, ముసలి వాళ్లు ఉన్న కూడా పట్టించుకోలేదన్నారు. పైగా నోటీసులు ఇచ్చామంటూ అబద్దాలు చెబుతున్నారని ఆమె విమర్శించారు. మళ్లీ అక్టోబర్ 6న హైడ్రా వాళ్లు వస్తామని చెప్పారంటా. ఆ లోపు పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలన్నారు. తక్షణమే బాధితులను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## చిన్న చర్లపల్లిలో ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడాలి



**చర్లపల్లి, సెప్టెంబర్ 22, (తెలంగాణ దిశ)** :చిన్న చర్లపల్లిలో ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడాలని కాంగ్రెస్ యువజన నాయకులు బూడిద ప్రేమ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు సోమవారం షామీర్ పేట్ మండలం అంతాయిపల్లి లోని మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చర్లపల్లిలోని సర్వేనెంబర్ 288 లోని ప్రభుత్వ భూమిని కబ్జాదారులు కబంధ హస్తంలోకి వెళుతుందని వివరించారు. సర్వే నెంబర్ 288లో 500 గజాలు స్కూల్ కు కేటాయించిన భూమిని సైతం కబ్జాదారులు వదలడం లేదన్నారు. గతంలో సర్వేనెంబర్ 30 నాల ఆక్రమణపై మంత్రి సీతక్క కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు ఒక్కరోజు మాత్రమే పనిచేశారని అన్నారు. అక్రమ నిర్మాణాల ఫిర్యాదుపై స్పందించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కాప్రా రెవెన్యూ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకుపోవడం వెనక రాజకీయ నాయకుల హస్తం ఉందా ? అని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా అధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# కబ్జాదారుల ఆస్తులను జప్తు చేయాలి: ఎంపీ ఈటెల

## - విచారణ జరిపి సహకరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22, (తెలంగాణ దిశ)** :గాజుల రామారం భూ కబ్జాదారుల ఆస్తులను తక్షణమే జప్తు చేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం బాధిత కుటుంబాలను ఓదార్చి వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించి నిరుపేదలను రోడ్డున పడేసిన విషయాన్ని తెలుసుకుని రాజేందర్ ఆ ప్రాంతాన్ని బిజెపి నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ కబ్జా దారులను వెంటనే అదుపులోకి తీసుకొని వారి ఆస్తులను జప్తు చేయాలని కోరారు. ప్రభుత్వం ఆలోచనహితమైన పనులు చేస్తుందని మండిపడ్డారు. కబ్జాదారులు రెవెన్యూ అధికారుల ప్రోత్సాహంతోనే ప్రస్తుతం ఈ నిరుపేదలు రోడ్డున పడడానికి కారణం అన్నారు. కబ్జాల విషయంలో మొదట్లోనే రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొనిఉంటే ప్రస్తుతం ఈనిరుపేదలు రోడ్డున పడే దుస్థితి ఉండేది కాదు కదా అన్నారు. రెవెన్యూ అధికారులు ఈ ప్రాంతంలో కబ్జాలు జరుగుతూ ఉంటే ఆనాడు కళ్ళు మూసుకున్నారా అని ప్రశ్నించారు. ఇన్ని గదులు నిర్మించే వరకు ఎలా ఊరుకున్నారని నిలదీశారు. ఇది నిజంగా ప్రభుత్వ స్థలమే అయ్యుంటే ఇన్ని గదులు నిర్మించే వరకు రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మార్వో కార్యాలయానికి కిలోమీటర్ దూరంలో నిజంగా కబ్జాలు జరిపి ఉంటే వారికి ఆనాడు కనిపించలేదా, లేక ఈ కబ్జాలను రెవెన్యూ అధికారులే కబ్జాదారులతో కలిసి ప్రోత్సహించారా అని నిలదీశారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపించే దీనికి సహకరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కబ్జాదారులను వెంటనే అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారించి నిరుపేద కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్ రెడ్డి,గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావులశేషగిరి, గాజులరామారం డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత,జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు సతీష్ , మాజీ కౌన్సిలర్ రాజారెడ్డి, శివాజీ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు గారిగె శేఖర్, జిల్లా అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులుకృష్ణారెడ్డి, రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులుఎంఎస్ వాసు, రాష్ట్రం మాజీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ మహిళా మోర్చా కన్వీనర్ నాగమణి,జిల్లా కౌన్సిల్ సభ్యులు పులి బలరాం, కంది శ్రీరాములు, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పి శ్రీనివాస్ రెడ్డి,130 డివిజన్ అధ్యక్షులు విజేందర్,జిల్లా ఓబీసీ నాయకులు మురళీకృష్ణ , డివిజన్ ప్రధాన కార్యదర్శి జ్ఞాని ఈశ్వర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ పటేల్, బండారి శ్రీధర్, లక్ష్మణ్, శారద, గడ్డమీది భరత్ కుమార్, వీరాచారి, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు .



## తెలంగాణ మైనార్టీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కానుకలు

### - పిఏసి చైర్మన్ అరికపూడి



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 22, (తెలంగాణ దిశ)** : మైనారిటీలకు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి గొప్ప కానుకతో చరిత్రాత్మక అడుగు వేస్తుందని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) చైర్మన్,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అన్నారు. 'ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన' 'రేవంత్ అన్నా కా సహారా మిస్కినో కే లియే' రెండు సరికొత్త పథకాలను ప్రారంభించారని అన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ గాంధీ కోరారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన పథకం కింద వితంతువులు, విడాకులు పొందినవారు, అనాథలు, అవివాహిత మహిళలకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. రేవంత్ అన్నా కా సహారా మిస్కినో కే లియే పథకం కింద ఫకీర్, దుదేకుల వర్గాలకు మోపెడ్ వాహనాలు అందించబడతాయన్నారు. రెండు పథకాల కింద ప్రయోజనాలను పొందడానికి వెబ్ సైట్ లో ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల అక్టోబర్ ఆరవ తేదీలోగా చేసుకోవాలని కోరారు. మోపెడ్‌లు, సైకిళ్ళు, ఇ-సైకిళ్ల రూపంలో ఒకేసారి ఆర్థిక సహాయం మంజూరు చేయడానికి దరఖాస్తుదారుడు ఫకీర్, దుదేకుల, దుర్బల ముస్లిం సమాజానికి చెందినవారై ఉండాలన్నారు. చిరునామా రుజువుగా దరఖాస్తుదారుడి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆహార భద్రతా కార్డు (తప్పనిసరి) జతపరచాలని సూచించారు. దరఖాస్తుదారుడి వయో పరిమితి 21 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలని గాంధీ సూచించారు. పథకాలు దుర్వినియోగం కాకుండా అర్హులు సద్వినియోగం చేసుకోవాలని గాంధీ కోరారు.

## రూ. 50 కోట్ల స్థలాన్ని ఫేక్ డాక్యుమెంట్ల సృష్టించి కబ్జాకు యత్నం




**నాగారం, సెప్టెంబర్ 22, (తెలంగాణ దిశ)** :మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ రాంపల్లి సర్వే నెంబర్ 385 లోని పట్టాదారులు రజిత రెడ్డి, రేఖారెడ్డి లకు సంబంధించిన ఎకరం భూమిని సుబ్బారెడ్డి అనే వ్యక్తి 50 మంది గుండాలతో వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాంపల్లి ప్రధాన రోడ్డు మార్గంలో భూమి ఉండడం వల్ల సుమారు రూ. 50 కోట్ల విలువ చేసే స్థలాన్ని సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఫేక్ డాక్యుమెంట్ సృష్టించి స్థలంలో ఉన్న ప్రహరీ గోడ ఫ్రీ కాస్ట్ వాల్స్ ను, చెట్లను ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. రాంపల్లిలో 1999లో సర్వేనెంబర్ 385లో రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. భూమి చుట్టూ కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసి, గది, ఎలక్ట్రిక్ మీటర్, ఎల్ ఆర్ ఎస్ చేసుకొని విదేశాలలో స్థిరపడ్డామని తెలిపారు. చాలాకాలంగా ఇక్కడ ఉండకపోవడం తో కబ్జా చేసిన పట్టించుకునే వారు లేరని భావించి భూమిని కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి సహకారంతో ఒక కార్పొరేషన్ చైర్మన్ తనకు సన్నిహితుడైన ఒక లోకల్ మనిషి సుబ్బారెడ్డిని రంగంలోకి దించారని వారు ఆరోపించారు. కీసర తహసిల్దార్ కు ఫోన్ చేసి సుబ్బారెడ్డి, చరణ్ రెడ్డి లకు సహకరించాలని, రాచకొండ పోలీసులకు రాంపల్లి భూమి విషయంలో తలదూర్చొద్దని చెప్పిన సదరు మంత్రి ఆదేశాలు జారీ చేసినట్టు వారు ఆరోపించారు. దీంతో భూమి చుట్టూ ఉన్న కాంపౌండ్ వాల్‌ను కూల్చేసి సుబ్బారెడ్డి, అతని అనుచరులు తమపై తిరగబడ్డారని ఆరోపించారు. అన్ని ఆధారాలు ఉన్నా భూమిని కబ్జా చేసారని, తనకు న్యాయం చేసి తన భూమి తనకు ఇవ్వాలని వేడుకున్న ఎన్ఆర్ఐ మహిళ వేడుకుంది.

# "విజయ హైస్కూల్" పూర్వ విద్యార్థి వెంగన్ శ్రీనివాస్ ఘనంగా సన్మానం

### - నీట్ లో ర్యాంకు.. గాంధీ మెడికల్ కాలేజీలో సీటు సాధించిన వెంగన్ శ్రీనివాస్





**కాప్రా, సెప్టెంబర్ 22, (తెలంగాణ దిశ)** :నీట్ 2025లో ఉత్తమ ర్యాంకు సాధించి అద్భుత ప్రతిభను కనబరిచి గాంధీ మెడికల్ కాలేజీలో సీటు సాధించిన కాప్రా విజయ హైస్కూల్ పూర్వ విద్యార్థి దేవినేని వెంగన్ శ్రీనివాస్ సోమవారం పాఠశాల యజమాన్యం ఘనంగా సన్మానించింది. గత కొన్ని రోజుల క్రితం వెలువడిన నీట్-2025 ఫలితాలలో ఉత్తమ ర్యాంకు సాధించిన పాఠశాల ప్రిన్సిపాల్ దేవినేని ప్రమీల వెంగబాబు కుమారుడు దేవినేని వెంగన్ శ్రీనివాస్ విజయ హైస్కూల్ లో ఉత్తమ విద్యను అభ్యసించి 2022-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ఉత్తీర్ణత చెందాడు. అనంతరం ఇంటర్మీడియట్ లో ఉత్తీర్ణత చెందారు. ప్రస్తుతం నీట్-2025లో ఉత్తమ ర్యాంక్ సాధించి గాంధీ మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు. ఈ తరుణంలో పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరి రాజేశ్వర్ పూర్వ విద్యార్థి దేవినేని వెంగన్ శ్రీనివాస్ ను జ్ఞాపికను అందజేసి, ఘనంగా సన్మానించారు. అనంతరం సన్మాన కార్యక్రమంలో రాజేశ్వర్ మాట్లాడుతూ విజయ హైస్కూల్ లో విద్యను అభ్యసించిన విద్యార్థులు ప్రతిభా పాటవాలతో అత్యున్నత స్థానం సంపాదించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొప్పునూరి వీణ, ప్రిన్సిపాల్ దేవినేని వెంగబాబు, ప్రధానోపాధ్యాయురాలు అద్దంకి పద్మావతి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22, (తెలంగాణ దిశ)** :కొంపల్లి లోని నార్త్ ఎన్ సిఎల్ కాలనీ నోబెల్ ఎన్ క్లేవ్ లోని దేవీ ఉపాసకులు రాచర్ల రవిచంద్ర శర్మ గృహం నందు నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి కృపా కటాక్షాలు, కరుణతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శిరీష ప్రవీణ్ రావు, పూజారి వసంతా లక్ష్మణ్ గౌడ్, డప్పు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కీసరగుట్ట ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పాడ్యమి తిథిన శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి అలంకారంతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ టి. నారాయణ శర్మ, ఈఓ కట్ట సుధాకర్ రెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యులు నల్ల మధుసూదన్ రెడ్డి, పోచబోయిన రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. - (కీసర, తెలంగాణ దిశ)



# సంపాదకీయం

## భౌతికవాద పునరుజ్జీవం నేటి కర్తవ్యం...

భారతదేశంలోని విశ్వవిద్యాలయాల్లో భారతీయ భౌతిక తత్వ శాస్త్రాన్ని బోధించకపోవడం వలన భారతీయ తాత్విక మూలాలు విద్యార్థులకు, ఆధునిక మేధావులకు అందడంలేదు. అసలు నిజానికి భారతీయ మొదటి తత్వశాస్త్ర భాగాలుగా చార్వాకం, జైనం, బౌద్ధం, సాంఖ్యం ప్రసిద్ధమైనవిగా చెప్పబడినవి. సర్వదర్శన సంగ్రహంలో వీటినే తత్వశాస్త్ర మొదటి దర్శనాలుగా ప్రకటించారు. ఈనాడు అన్ని కేంద్ర విశ్వవిద్యాలయాల్లోను, రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లోను తత్వశాస్త్ర విభాగాల్లో చార్వాకాన్ని చెప్పకపోవడం వలన వేదాలే మొదటివి అనుకునే పరిస్థితి వచ్చింది. కాని నిజానికి వేదాలు భారతీయ భౌతికవాదాన్ని పూర్వపక్షంగా వచ్చినవే. భారతదేశం ప్రధానంగా నదీ నాగరికతతో పాటు మాతృస్వామికమైన దేశం. నిప్పు, నీరు, గాలి, నేలను జీవన విధానంగా మలుచుకోన్న దేశం. ఈ మూలాలు విశ్వవిద్యాలయాలలో విద్యార్థులకు తెలియకపోతే వారికి ప్రాకృతిక భౌతిక జ్ఞానం తగ్గుతుంది. ఇప్పుడు ప్రయాగలో జరుగుతున్న కుంభమేళా నదీ నాగరికతను ఎలా విధ్వంసం చేస్తుందో తెలుసుకోలేరు. భారతదేశంలో తత్వ శాస్త్రమంటే ఆధ్యాత్మిక వాదంగా ప్రచారం చేశారు. తత్వశాస్త్రమనగానే ఆత్మ గురించో, పరలోకం గురించో చెప్పేదనే భావన ఏర్పడింది. నిజానికి భౌతికాంశాల నుండి రూపొందిన దాన్నే తత్వ శాస్త్రం అంటారు. భారతదేశంలో అతి ప్రాచీన జాతులు ఈ తాత్వికాంశాల మీద సుదీర్ఘమైన చర్చ చేశారు. శరీరానికి, చైతన్యానికి ఉన్న సంబంధాన్నీ మానవునికీ ప్రకృతికి ఉన్న సంబంధాన్నీ విశ్వ పరిణామాన్ని, మానవ పరిణామాన్నీ భౌతిక దృక్పథంతో వారు వివేచించారు. మానవునికి తన చుట్టూ వున్న ప్రకృతి, సమాజం పట్ల ఉదయించిన అనేక ప్రశ్నలకు వారు భౌతిక దృక్పథంతో సమాధానం వెతికారు. మానవుడు భౌతిక ప్రపంచం నుండి ప్రభవించడం వల్ల అతని ఆలోచనలు, భావాలు, ఊహలు భౌతిక వాస్తవికత వైపే మొదట్లో పయనించాయి. నిప్పునీ, నీరునీ, గాలినీ, భూమినీ వాటి భౌతిక రూపాలను తెలుసుకోవడమే మానవుని అభివృద్ధి సోపానం. నిప్పుని, నీరునీ, గాలినీ, భూమినీ వాటి భౌతిక రూపాలను తెలుసుకోవడానికి ముందు, దాని భౌతిక శక్తిని అర్థం చేసుకోక ముందు వడివడిగా ముందుకు నడవలేకపోయాడు. నిప్పు మానవ సామాజిక పరిణామంలో కీలక పాత్ర వహించింది. నిప్పుని ఆరాధించిన జాతుల కంటే, నిప్పుని భౌతిక శక్తిగా గుర్తించిన జాతులు శక్తివంతంగా ముందుకు నడిచాయి. నిప్పు మానవ జీవితాన్ని ఒక భౌతిక శక్తిగా ప్రభావితం చేసింది. భారతదేశంలో చార్వాకులు నిప్పుకి 'భౌతిక శాస్త్రతత్వాన్ని' రూపొందించారు. నిప్పునారాధించే జాతులకీ, నిప్పుని అధీనం చేసుకొన్న జాతులకీ భారతదేశంలో సమరం జరిగింది. తన చుట్టూ ఉన్న భౌతిక ప్రపంచాన్ని సమన్వయించుకోవడంలో విఫలమైనవారు భావవాదులుగా రూపొందారు. వీరు భౌతిక సామాజిక వాస్తవికతకు భిన్నమైన భావవాదంతో భౌతికవాదులకెదురు నిలుస్తూ వచ్చారు. నిప్పుని పదార్థంగా కనుగొన్న చార్వాకుల వారసులు భారతీయ ఆదిమ జాతుల వారే. అడవులు తగులబెట్టి పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనుల పరిణామం నుండి వ్యవసాయ సంస్కృతిని రూపొందించి నిప్పుని భౌతిక శక్తిగా వాడుకున్నారు.వేదాలు భారత దేశానికి వలస వచ్చిన రాజకీయ తెగలైన ఆర్యులు రూపొందించుకున్న భావజాలం. ఈ వేదాలు క్రీఎపూఎ 2000–750 సంవత్సరాల మధ్యలో రచించబడినాయని వింటర్‌నిట్జ్ పేర్కొన్నాడు. కీత్ క్రీఎపూఎ 1200–350 సంవత్సరాల మధ్యలోవని తెలిపాడు. సాధారణంగా వేద రచన క్రీ.పూ 1400 ప్రాంతంలో ప్రారంభమై క్రీఎపూ 600 వరకు జరిగిందని చరిత్రకారులు భావిస్తున్నారు. వేద శబ్దమునకు "జ్ఞానమ"ని అర్థం ఇవ్వబడింది. జైమిని అభిప్రాయం ప్రకారం వేదాలు రెండు భాగాలు. 1. మంత్రాలు 2. బ్రాహ్మణాలు. మంత్రాల సంకలనాన్ని సంహితలని అంటారు. ఋగ్వేదానికీ, యజుర్వేదానికీ, సామ వేదానికీ, అధర్వణ వేదానికీ, సంహితలున్నాయి. ఇవి ఒకరి నోటి నుండి ఒకరు కంఠస్థం చేశారు. అందుకే వీటిని శృతులు అన్నారు. వేదాలను సంహితులుగానే కాక బ్రాహ్మణాలుగా, అరణ్యకాలుగా కూడా విభజించారు. నాలుగు వేదాల్లో అతి పురాతనమైంది ఋగ్వేదం. ఋగ్వేద మంత్ర కర్తలలో విశ్వామిత్రుడు, వశిష్టుడు, భరద్వాజుడు, గౌతముడు ముఖ్యులు. వీరు క్రీఎపూ 1500 ప్రాంతం వారీగా గుర్తింపబడ్డారు. ఋగ్వేదం క్రీఎపూ 1520 ప్రాంతం నుండి క్రీఎపూ 1420 దాకా వివిధ ఋషుల చేత రాయబడుతూనే ఉంది. ఋగ్వేదంలో అగ్ని, వరుణుడు, సూర్యుడు, ఇంద్రుడు మొదలైన దేవతలను కొనియాడారు. నిజానికి చార్వాక వాదం, జైనవాదం, బౌద్ధవాదం, సాంఖ్య తత్వశాస్త్రం బోధించబడితే విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు భారతదేశంలో తాత్విక మూలాలు అర్థం అవుతాయి. దానివల్ల దేశంలో వైజ్ఞానిక, శాస్త్రీయ, సాంకేతిక జ్ఞానం పెరుగుతుంది. అయితే బిజెపి, ఆర్‌యస్‌యస్, విశ్వహిందూ పరిషత్‌ల భావజాలాలు చొప్పించాలని చూస్తున్నారు. ఇది దేశానికి మంచిది కాదు. భారత దేశం ఒక మతానికి సంబంధించినది కాదు. ఒక వర్ణాధిపత్యానికి లోబడదు. ఇది లౌకికవాద భావజాలంతో కూడినది. భారతదేశ భౌగోళిక పరిస్థితుల నుంచి అనేక ఉపఖండాల నుండి మన దేశానికి వలస వచ్చిన పాలకులు భిన్న మతాలను తీసుకు వచ్చారు. వైదికం, ఇస్లాం, క్రైస్తవం బయట నుండి వచ్చినవే. చార్వాకం, బౌద్ధం, జైనం, సాంఖ్యం దేశీయంగా పుట్టిన తత్వాలు, ధర్మాలు. అవి ఆ తరువాత మతాలుగా పిలువబడ్డాయి. అందుకే ఈనాడు భారతీయ తాత్విక బోధన ద్వారా విద్యార్థులను, పరిశోధకులను, రాజకీయవేత్తలను ప్రభావితం చేయాలంటే భారతీయ భౌతికవాద చింతన తప్పక జరగాలి. నీటిని కల్మషం చేసే కుంభమేళాలు భారతదేశ సంస్కృతి కాదు. ఇవి వ్యవసాయ సంస్కృతికి, పారిశ్రామిక విధానాలకు వ్యతిరిక్తమైనవి. మనిషిని మూఢ విశ్వాసాల్లోకి నెట్టి జ్ఞాన శూన్యం చేస్తాయి. తాత్విక జిజ్ఞాస నుండి కర్మకాండల్లోకి నెడతాయి. ఇవి పితృస్వామిక భావజాలంతో నడుస్తున్నాయి. ఇవి యువతను పక్కదారి పట్టిస్తున్నాయి. యువతను లైబ్రరీలకు, పరిశోధనలకు, రచనలకు, సృజనానికి, కళాసృష్టికి వెళ్లకుండా నిరోధిస్తున్నాయి. అందుకే, భారతదేశంలో నూతన సామాజిక తాత్విక విప్లవం నేటి అవసరం. ఆ దిశగా పయనిద్దాం.

# కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22, (తెలంగాణ దిశ) :**షామీర్ పేట్ మండలం అంతాయిపల్లిలోని మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ అదనపు కలెక్టర్ రాధికగుప్తా, డిఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి మహిళా అధికారులు బతుకమ్మ వేడుకలలో పాల్గొన్నారు. రెవెన్యూ సివిల్ సప్లై శాఖల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు అదనపు కలెక్టర్ (రెవిన్యూ) విజయేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పెద్ద పండుగ అని అన్నారు. తెలంగాణ ఆచార సంప్రదాయమైన బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారని తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ ఆటలతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రా వతిలు బతుకమ్మలకు కొబ్బరికాయలు కొట్టి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా, డిఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి లు బతుకమ్మ ఆడారు. అలాగే జిల్లా స్థాయి మహిళా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది బతుకమ్మ ఆడారు. అందంగా రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మను మధ్యలో మహిళలు పాటలు పాడుతూ బతుకమ్మ పండగను జరుపుకొన్నారు. సాంస్కృతిక సారధులు పాడిన బతుకమ్మ పాటలు అందరిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, ఆయా శాఖల మహిళా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

## - అదనపు కలెక్టర్ రాధిక గుప్తా





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22, (తెలంగాణ దిశ) :**ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు రాధిక గుప్తా ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి రాధికగుప్తా 95 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసల కోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని కోరారు. అదే విధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పని సరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంటనే నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమాయకపు ప్రజలు రోడ్డున పడటం గత బిఆర్ఎస్ ప్రభుత్వ వైపల్యమే - కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22, (తెలంగాణ దిశ) :**గాజుల రామారం డివిజన్ లో బాలయ్య నగర్, గాలిపోచమ్మ బస్తీ, అబిద్ బస్తీ, నర్సింహ బస్తీ, శివపురం, మిథులానగర్ లలో ఆదివారం హైడ్రా అక్రమ కట్టడాలను కూల్చివేసిన అనంతరం నిరాశ్రయులైన ప్రజలు సోమవారం కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నివాసానికి వచ్చి ఆవేదనను వ్యక్తం చేస్తూ న్యాయం చేయాలని కోరారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ నిరాశ్రయులైన ప్రజల ఆవేదన చూసి చాలా చింతించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పాలకులు, నాయకులు అమాయకపు ప్రజలను ఆసరాగా తీసుకోని అనేక అక్రమాలకు పాలు పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి అంటే ప్రజలందరిదీ అనే ఆలోచనను మర్చిపోయి భూ కబ్జాదారులతో చేతులు కలిపి పేద ప్రజలకు అన్యాయం చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఇంచార్జీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్ళి నిరాశ్రయులైన ప్రజలకు న్యాయం జరిగేల కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

# శిల్పారామంలో బతుకమ్మ, నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం





**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ దిశ):** మాదాపూర్ లోని శిల్పారామంలో బతుకమ్మ నవరాత్రి, దసరా ఉత్సవాలు, సారీస్ ఆఫ్ ఇండియా మేళా జరుగుతోంది. పోచంపల్లి, నారాయణపేట, గద్వాల్, ఉప్పాడ, పటోళ్ల, కోట, తస్సార్, జాంధానీ, భాగల్పూరి, ఉప్పాడ, మొదలైన రకాల చీరలు మహిళల కోసం ఏర్పాటు చేశారు. శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మ ను పేర్చి ఆడుకున్నారు. సోమవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా లలిత పాటలు, లలిత నవరూపిణి నృత్య రూపకం ఏర్పాటు చేసారు. చంద్రబాల, ఫణిబాల శిష్య బృందం "అంబ కృతులు" ఆలపించారు. మృదంగంపై వెంకటేశ్ సహకరించారు. సుందరి రవిచంద్ర శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలో "దేవి నవరూపిణి " నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. నివేదిత, వైష్ణవి, వరుని, హంసిని, కావ్య, భార్గవి శ్రేయ మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.





దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఓల్డ్ మల్లాపూర్ కు చెందిన టిక్క వెంకట్ ప్రసాద్ మిత్ర బృందం నెలకొల్పిన అమ్మ వారి మందిరాన్ని తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మ వారి విగ్రహ ప్రతిష్ట, బాల త్రిపుర సుందరి అవతారాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

(మల్లాపూర్, తెలంగాణ దిశ)

# జమ్మిగడ్డ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



**ఏఎస్ రావునగర్, సెప్టెంబర్ 22, (తెలంగాణ దిశ) :**అమావాస్య సందర్భంగా జమ్మిగడ్డ ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో మారుతీ నగర్ సాయిబాబా మందిర్ ప్రాంగణంలో అన్న ప్రసాదం వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మిగడ్డ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, మేడ్చల్ మల్కాజిగిరి అధ్యక్షులు బెలిదే రమేష్ గుప్తా, బల్లి శ్రీనివాస్, బల్లి శ్రీధర్ మహేష్, ఉప్పల శ్రీనివాస్, కె. రాధాకృష్ణ, జి. రమేష్, ఆర్. విజయ్ కుమార్, పి. బాల్ లింగం, టి. రవి, ఎం. శ్రీనివాస్, పి. విజయ్ పి. పవన్, సి. సంతోష్, ఆర్. శ్రీను, జి. పరమేష్, పి. కిషన్, పి. ప్రవీణ్, టి. మేఘరాజు పి. పండయ్య, పి. రాము, జి. సురేష్, ఎం. జగదీష్, వినోద్, ప్రకాష్, వెంకటేష్, సూర్య నారాయణ, జి. కిషోర్, కనకయ్య, ఎస్. వెంకటేష్, ఎం. జగదీశ్వరయ్య, వినోద్, ప్రకాష్, టి. శ్రీనివాస్, జి. శ్రవణ్, రాజు, ఎం. రవి, కె. నాగరాజు, సుభాష్, నాగరాజు, నాగయ్య, రాజేష్ హరినాథ్, శంకర్ చంద్రం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# యాప్‌లతో అంగన్‌వాడీల్లో అక్రమాలకు చెక్

## లబ్ధిదారులకు నేరుగా సరుకుల పంపిణీ

## - హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు




అమరావతి:చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం, సరుకులు పంపిణీ చేస్తున్నాయి. కొన్నిచోట్ల అవి అనర్హులకు చేరుతున్నాయనే ఆరోపణలున్నాయి. మరి కొన్నిచోట్ల లబ్ధిదారులకు ఇవ్వకపోయినా ఇచ్చినట్లు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటికిఅడ్డుకట్ట వేసేందుకు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంది. ముఖ ఆధారంగా పనిచేసే పోషణ్ ట్రాకర్, బాల సంజీవని యాప్?లను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపై లబ్ధిదారుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. కొన్నేళ్ల క్రింతం వరకు అంగన్?వాడీ కేంద్రాలు అక్రమాలకు నిలయాలుగా ఉండేవి. ఈ పరిస్థితిని కట్టడి చేస్తూ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# యువత చూపు.. మద్యపాన నిషేధం వైపు..!

ఆత్మకూర్, తెలంగాణ దిశ : : గట్టికల్‌లో మద్య నిషేధానికి కదిలిన యువకులు అర్ధరాత్రి వరకు గొడవలు, ఘర్షణలు, నలభై ఏళ్లకే కాలేయం, మూత్రపిండాలు దెబ్బతిని ఇంటిపెద్ద మృతి, చిన్న వయసులోనే వితంతువుగా మారిన మహిళలు, వారిపై పిల్లల భారం, తాగొచ్చి భర్త చేసే అల్లరికి తాళలేక పుట్టింటికి వెళ్లిన భార్య.. ఆలూమగల పంచాయితీలో నలిగిన చిన్నారులు.. ఇవీ పల్లెల్లో విచ్చలవిడి మద్యం విక్రయాలతో కనిపిస్తున్న హృదయ విదారక దృశ్యాలు. పగలూ, రాత్రి మద్యం విక్రయించే గొలుసు దుకాణాలు పచ్చని సంసారాల్లో చిచ్చురేపుతున్నాయి. కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. ఈ ఘటనలను కళ్లారచూసిన యువత మద్యపాన నిషేధం వైపు అడుగులు వేస్తోంది. సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) మండలంలో పలు గ్రామాల్లో యువ చైతన్యం మద్యం మహమ్మారిపై ఉక్కుపాదం మోపుతోంది. మండలంలోని ఇస్తాళాపురం గ్రామంలో 2015 సెప్టెంబరు 21 నుంచి మద్యపాన నిషేధం అమలులోకి వచ్చింది. తొమ్మిదేళ్లు పూర్తి చేసుకొని పదో సంవత్సరంలోకి అడుగిడింది. ఈ గ్రామంలోని మహసేన, యువ, వింగ్స్ తదితర యువజన సంఘాల యువకులు ఏళ్లతరబడి పట్టుదలతో కట్టడి చేయడంతోపాటు జరిమానాలు విధిస్తున్నారు. ఇస్తళాపురం గ్రామం స్ఫూర్తితో ఇటీవల అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని గట్టికల్, పాతర్లపహాడ్ గ్రామాల్లో మద్యపానాన్ని నిషేధించాలంటూ తీర్మానాలు చేశారు. ఆ తీర్మానం గట్టికల్‌లో ఈ నెల 14 నుంచి, పాతర్లపహాడ్‌లో 16 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఉద్యమంలో యువజన సంఘాలు అఖిలపక్ష



పార్టీలు, అధికారులకు, పోలీసులకు పూర్తి సహకారం అందిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజా చైతన్యం కోసం ద్విచక్ర వాహన ర్యాలీలు తీశారు. ప్రతి గొలుసు దుకాణానికి వెళ్లి అవగాహన కల్పించి మూసి వేయించారు. గట్టికల్‌లో జైభారత్, సర్దార్, అరుంధతి, కంఠమహేశ్వర, లెనిన్, సర్వోత్తమ్, చైతన్య జ్యోతి, గోల్డెన్‌స్టార్, బంగారుగడ్డ యువజన సంఘాల సభ్యులు ఉద్యమంలో పాలుపంచుకున్నారు. పాతర్లపహాడ్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ యంగ్‌స్టార్ యువజన సంఘం, గోల్డెన్‌స్టార్, కౌండిన్య, నవోదయ యువజన సంఘం యువకులు అఖిలపక్ష నాయకులతో కలిసి గ్రామస్థులను చైతన్యపరిచారు. మండలంలో ముక్కుడుదేవులపల్లి, తుమ్మలపెన్‌పహాడ్‌లోనూ యువజన సంఘాల ప్రతినిధులు గొలుసు దుకాణాలను మూసి వేయించేందుకు గ్రామపెద్దలతో చర్చలు జరుపుతున్నారు.

# జీఎస్టీ ప్రయోజనాలపై ఎంపీ ఈటల పాదయాత్ర





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22, (తెలంగాణ దిశ)** :ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీఎస్టీ పన్ను భారం తగ్గించడంతో సామాన్యులకు ఎలాంటి లబ్ధి చేకూరుతుందో వివరించడంలో భాగంగా కొంపల్లి కమాన్ నుండి శివాలయం వరకు సోమవారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాదయాత్ర చేస్తూ యాజమాన్యాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ కేంద్ర పార్టీ పిలుపుమేరకు జివిస్టి వల్ల ప్రజలకు ఏ విధమైన లబ్ధి చేకూరుతుందో దాన్ని వివరించే కార్యక్రమాన్ని చేపట్టారు. గతంలో రాష్ట్రాన్ని బట్టి వస్తువు రేటు ఉండేది.. ఏ రాష్ట్రంలో అయితే తక్కువ ఉంటుందో అక్కడ కొనుగోలు చేసి ఎక్కువ టాక్స్ కు అమ్ముకునే బ్లాక్ మార్కెట్ జరిగేదన్నారు. యూపీఏ ప్రభుత్వం బ్లాక్ మార్కెట్ ను నివారించాలని చూసిన కాలేదన్నారు. నరేంద్ర మోడీ ధైర్యం చేసి మూడేళ్లు జీఎస్టీ పై అధ్యయనం చేసి పేద ప్రజలకు ధరలు అందుబాటులో ఉండేలా చేశారన్నారు. ఒకప్పుడు సెల్ ఫోన్లు, ఏసీలు, కార్లు ఏవి కావాలన్నా ఇతర దేశాల నుండి తెచ్చుకునేవాళ్లం... మోడీ వచ్చిన తర్వాత మన దగ్గర ఉన్న యువశక్తి, మేధా సంపత్తును ఉపయోగించుకొని "మేక్ ఇన్ ఇండియా – మేడ్ ఇన్ ఇండియా" అనే నినాదానికే పరిమితం కాకుండా ఇక్కడే అన్ని వస్తువులు తయారు చేసే విధంగా మార్చారన్నారు. 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ నాలుగవ ఆర్థిక వ్యవస్థకు వచ్చింది. అది మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని మోడీ కలలు కంటున్నారని, దానికి మనందరం కూడా తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, సతీష్ సాగర్, రాజిరెడ్డి, జనార్ధన్ రెడ్డి, సరిత, ఝాన్సీ, శివాజీ, నర్సింగరావు, కృష్ణవేణి, నాగమణి, నరసింహ, గోపాల్ రెడ్డి, శ్రీకాంత్, మురళీకృష్ణ, మహేశ్వర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, ఆకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో దళారులు, దడువాయిల దందామోసపోతున్న పత్తి రైతులు



ఆత్మకూర్, తెలంగాణ దిశ : :ఆత్మకూర్(ఎస్)లో తప్పుడు తూకాల వ్యవహారంపై దళారులను నిలదీస్తున్న రైతులు ఇటీవల చివ్వెంల మండలానికి చెందిన ఓ వ్యక్తి, మరో దళారి కలిసి మూసీ ప్రాంతంలోని ఇటుకపహాడ్‌లో పత్తిని కొనుగోలు చేస్తుండగా తూకంలో తేడాలు రావడంతో రైతులు గొడవకు దిగారు. ఆత్మకూర్(ఎస్) మండలానికి చెందిన ఓ పత్తి వ్యాపారి చివ్వెంల మండలం గుంజలూరులో ముగ్గురు రైతుల వద్ద పత్తి కొనుగోలు చేశారు. ఒకసారి 74 కిలోలు తూకం వచ్చిన పత్తి బస్తాను అనుమానంతో రెండోసారి తూకం వేస్తే 81కిలోలకు పెరిగింది. ఏడు కిలోలు తేడా రావడంతో రైతులు ఆగ్రహించారు. కాంటాలను నిలిపేశారు. ఒక్క రోజులో వంద క్వింటాళ్ల పత్తి కాంటా వేస్తే అందులో తప్పుడు తూకం ద్వారా 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు కొన్నవారికి మిగలాలి.' ఇదీ పల్లెల్లో పత్తి కొనుగోలుకు దళారులు అనుసరిస్తున్న విధానం. ఈ మోసంలో తూకం వేసిన దడువాయి రోజూ రూ.5 వేల నుంచి 10 వేల వరకు దక్కితే, లక్షల రూపాయలు దళారుల జేబుల్లోకి వెళ్తున్నాయి. రోజూ ఇదే దందా.. ఇదే మోసం. పర్యవేక్షణ చేపట్టి అడ్డుకునే వారు లేరు. గ్రామాల్లో పత్తి కొంటామంటూ వచ్చే వ్యాపారులు ఆరుగాలం కష్టించి పంట పం డించిన రైతులు నిలువునా ముంచుతున్నారు. ఏళ్లకొద్దీ ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో తప్పుడు కాంటాలతో పత్తి వ్యాపారం మోసం చేస్తూ తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరుకాయలుగా విస్తరించుకుం టున్నారు. ముఖ్యంగా తూకంలో మోసం చేసి క్వింటాకు పది కిలోల వరకు రైతుకు తక్కువగా చూపిస్తున్నారు. దళారుల మోసాల కారణంగా రైతులు అప్పులపాలవుతున్నారు. ముఖ్యంగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఈ రెండేళ్లుగా పత్తి వ్యాపారంలో దళారులు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. తమకు నమ్మకమైన దడవాయిలను పెట్టుకొని గ్రామగ్రామాన బేరం చేస్తూ కొండి కాంటాలను ఉపయోగిస్తూ కర్షకులను నట్టేట ముంచుతున్నారు. కొండి కాంటాల వల్ల క్వింటాకు ఐదు నుంచి పది కిలోల వరకు రైతుకు తక్కువ తూకం చూపిస్తారు. ఆత్మకూర్(ఎస్) మండలకేంద్రంలో ఆదివారం రెండు వర్గాలుగా మారిన పత్తి దళారులు గ్రామ పంచాయతీలో గొడవ పడ్డారు. గమనించిన స్థానిక రైతులు వారికి ఎదురు తిరిగి కాంటాలలో చేస్తున్న మోసాలపై నిలదీశారు.

# లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో ఘనంగా ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు





**కీసర, సెప్టెంబర్ 22, (తెలంగాణ దిశ)** :శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని ఆలయ ఫౌండర్ అండ్ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ చేతులమీదుగా వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మహాలక్ష్మి అవతారంలో భక్తులకి అమ్మవారు దర్శనమిచ్చారు ఈ కార్యక్రమంలో ధర్మకర్త శ్రీహరి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి ప్రణాళికలు షురూ..!



భువనగిరి,తెలంగాణ దిశ :ఉపాధిహామీ పథకం గ్రామీణ కూలీలకు కొన్నేళ్లుగా చేతినిండా పని కల్పిస్తుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ప్రతిఏటా నూతన పనుల గుర్తింపు ప్రక్రియ చేపట్టి పరిపాలన ఆమోదానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. ముఖ్యంగా వలసల నివారణకు ఉన్న గ్రామాల్లోనే పని కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిరుపేదలకు బాసటగా నిలుస్తుంది. పథకం ద్వారా సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, వనమహోత్సవం, పల్లె క్రీడా మైదానాలు వంటి పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, వ్యవసాయ బావులకు రహదారి నిర్మాణాలు, కట్టుకాల్వల పనులను చేపట్టారు. ఈ సారి భూగర్భజలాలు పెంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాల్వలు, మట్టి దారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా సంబంధిత శాఖల అధికారులు అంటున్నారు. పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందుకు పనులు గుర్తించడంతో పాటు ప్రజల అంగీకారం తప్పనిసరి కావడంతో ఇప్పటి నుంచే ప్రక్రియ చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పనులకయ్యే ఖర్చు వివరాలు తయారుచేసి పంపించాల్సి ఉంటుంది.ఎంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాల్వలు, మట్టి దారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా సంబంధిత శాఖల అధికారులు అంటున్నారు. పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ వెంటనే తీర్మానాలను ఉపాధిహామీ వెబ్‌సైట్‌లో పొందు పరిచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26)లో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తించనున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాల్లోని 1740 గ్రామ పంచాయతీలలో ఈ నెలాఖరు లోపు గ్రామసభలు పూర్తి చేసి, నవంబరులో మండలాల వారీగా ప్రణాళిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. వాటిని క్రోడీకరించి రాష్ట్రస్థాయిలో ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. పరిపాలన ఆమోదం వెంటనే గ్రామాల్లో సదరు పనులను ఉపాధికూలీల ద్వారా చేపట్టనున్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనుల తీరుపై ప్రణాళికల రూపకల్పనకు ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా గ్రామీణాభి వృద్ధి శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల సమ్మతితో పనులు గుర్తించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ విషయమై గాంధీ జయంతి రోజు నుంచి ఈ గ్రామసభల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నెలాఖరు వరకు పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఈసారి భూగర్భ జల వనరుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

# టోకెన్ ఉంటేనే కొనుగోళ్లు..!




**యాదాద్రి,తెలంగాణ దిశ :** యాదాద్రి భువనగిరి జిల్లాల వ్యాప్తంగా 2024–25 వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ప్రారం భమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వాటిల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం తనిఖీలు చేపడుతోంది. పర్యవేక్షణకు మండల స్థాయిలోనూ కమిటీలు ఏర్పాటు చేశారు. అవకతవకల నివారణకు గతంలో మాదిరిగానే ఈసారి కూడా టోకెన్ల విధానం అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 907 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 10.42 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేసి సన్న, దొడ్డు రకం వడ్లను వేర్వేరుగా కొనడానికి కేంద్రాలు ఏర్పాటు చేశారు. టోకెన్ విధానం లేనప్పుడు కేంద్రం నిర్వాహకులు అవకతవకలకు పాల్పడేవారు. నగదు ముట్టజెప్పిన రైతుల ధాన్యాన్ని కాంటాలు వేశారు. మిల్లర్లు ఆ ధాన్యానికి కోత విధించేవారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ఇతర గ్రామాల ధాన్యాన్ని, దళారుల సరకునూ ఆయా నిర్వాహకులు కొనుగోలు చేసేవారు. దీంతో కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్న రైతులు ఇబ్బందులు పడాల్సిన వచ్చేది. కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు రావడంతో రెండేళ్ల క్రితం టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు.అవకతవకలకు తావు లేకుండా సజావుగా కొనుగోళ్లు జరుగుతున్నాయి. ముందుగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన సమయంలో నిర్వాహకులు రైతు పేరు, వివరాలు నమోదు చేసుకుంటారు. మండల వ్యవసాయ అధికారులు ధాన్యం తేమ శాతం పరిశీలిస్తారు. 17 శాతం తేమ వచ్చినసంబంధిత రైతుకు టోకెన్ అందిస్తారు. దాని ప్రకారం ధాన్యా న్ని బస్తాల్లో ఎప్పుడు నింపుతారు, మిల్లుకు ఎప్పుడు తరలిస్తారో.. చెబుతారు.

# పరికరాల కొరత.. సాగని విద్యుదీకరణ



**నల్గొండ,తెలంగాణ దిశ :** దిమ్మె నిర్మించినా ఏర్పాటు చేయని విద్యుత్తు నియంత్రిక పెరుగుతున్న విద్యుత్తు సర్వీసులకు అనుగుణంగా చేపడుతున్న విద్యుదీకరణ పనులకు బ్రేకులు పడుతున్నాయి. సంస్థలో పరికరాల కొరత వేధిస్తోంది. వానాకాలం పంటల నూర్పిడి పూర్తి కానుండటంతో నిలిచిన, కొత్తగా చేపట్టాల్సిన పనులు ప్రారంభించేందుకు గుత్తేదారులు ముందుకు వస్తున్నా.. విద్యుదీకరణ పనులకు కావాల్సిన ప్రధాన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయి. దీంతో రైతులు, వినియోగదారు లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక చోట కాకుండా దాని పరిధిలోని గ్రామాల్లో సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 10 వేలకు పైగా ఉచిత వ్యవసాయ బోరుబావుల సర్వీసులను ఇటీవల విడుదల చేసింది. వాటికి కరెంటు సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుదీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రైతులు సొంత ఖర్చులతో దిమ్మెలు నిర్మించుకుని పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. లోవోల్టేజీ ఉన్న ప్రాంతాల్లో టీఎస్డీ స్కీం ద్వారా నియంత్రికల సామర్థ్యం పెంచాల్సి ఉంది. రైతులు విద్యుత్తు నియంత్రికల కోసం డీడీలు చెల్లించినా.. మంజూరైన స్తంభాలు, తీగ, ఏబీ స్విచ్‌లు, హెడ్జ్ ఫ్యూజుల కాసారాలు, క్లాంపులు వంటి సామగ్రి నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం అధికారులు అందించలేకపోతున్నారు. నియంత్రికల వద్ద కరెంటు సరఫరాను నియంత్రిం చడంలో కీలకమైన ఏబీ స్విచ్‌ల కొరత ఎప్పటి నుంచో వేధిస్తోం ది. ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే విద్యుత్తు ఉపకేంద్రాల్లో కరెంటు సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఒక చోట కాకుండా దాని పరిధిలోని గ్రామాల్లో సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 10 వేలకు పైగా ఉచిత వ్యవసాయ బోరుబావుల సర్వీసులను ఇటీవల విడుదల చేసింది. వాటికి కరెంటు సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుదీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రైతులు సొంత ఖర్చులతో దిమ్మెలు నిర్మించుకుని పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. లోవోల్టేజీ ఉన్న ప్రాంతాల్లో టీఎస్డీ స్కీం ద్వారానియంత్రికల సామర్థ్యం పెంచాల్సి ఉంది. అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ నియంత్రికల కొరతతో పనుల్లో జాప్యం నెలకొంటుంది. దేవరకొండ, నల్గొండ, ఆలేరు, మునుగోడు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టాల్సి ఉండగా.. పరికరాల కొరతతో అవాంతరాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నల్గొండ, యాదాద్రి భువనగిరి సర్కిళ్ల పరిధిలో సుమారు 1050కి పైగా విద్యుత్తు నియంత్రికలు, 1125కిపైగా ఏబీ స్విచ్‌ల కొరత నెలకొంది. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా విద్యుత్తు శాఖలపై సమీక్ష నిర్వహించారు. పరికరాల కొరతను అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో పాటు సీఎండీతో చర్చించినట్లు తెలిసింది. మంత్రి కోమటిరెడ్డిచొరవతో 250 వరకు నియం త్రికలు అందజేస్తామని హామీ ఇచ్చారని సమాచారం. ఈ మేరకు ఇటీవల వంద ట్రాన్స్‌ఫార్మర్లు నల్గొండ జిల్లాకు చేరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇంకా 900లకు పైగా విద్యుత్తు నియంత్రికలు తక్షణం అవసరం ఉంది. వెంకటేశ్వర్లు, ఎస్ఈ, విద్యుత్తు సంస్థ నల్గొండ సర్కిల్ కొత్తగా బాధ్యతలు స్వీకరించాను. పూర్తి వివరాలు తెలుసుకుంటాం.

# అలంకారప్రాయంగా బస్తీ దవాఖానా?



వేములవాడ,తెలంగాణ దిశ :పేద ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా అలంకారప్రా యంగా మారింది. వేములవాడలోని రాజన్న దర్శనానికి వచ్చే భక్తులతో పాటు జాత్రగౌండ్ ప్రాంతంలోని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏడాదిన్నర క్రితం ఆలయ లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో దీనిని ఏర్పాటు చేశారు. అన్ని వసతులు కల్పించి రెండు పడకలతో ప్రారంభించారు. ఇందులో ఒక వైద్యుడు, స్టాఫ్‌నర్స్, హెల్పర్‌ను నియమించారు. ఆసుపత్రి ఏర్పాటు చేసినప్పటి నుంచి నామమాత్రంగానే రోగులు వస్తున్నారు. స్థానికులు మాత్రం రక్తపోటు, మధుమేహం, దగ్గు వంటి వాటికి మందుల కోసం వస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులే తక్కువగా ఉంటే మందులు కూడా అరకొరగానే సరఫరా అవుతున్నాయి. మందుల కోసం ఇండెంట్ పెట్టినప్పటికీ ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. ఒక వేళ వచ్చినా పూర్తి స్థాయిలో రావడం లేదు. ఆరు నెలల నుంచి అరకొరగానే మందులు వస్తున్నట్లు చెబుతున్నారు. ఆసుపత్రి ముందు భక్తులు, ఇతరులు వాహనాలు నిలుపుతున్నారు. దీనికి ఇరువైపులా రహదారులను ఆక్రమించి డబ్బాలు ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. వారంలో ఈ రోజుల్లోనే... వారంలో శనివారం ఆసుపత్రికి సెలవు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యుడు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. మిగతా రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచి ఉంటుంది. రాజన్న ఆలయానికి రాత్రింబళ్లు భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం వేములవాడకు వచ్చినవారు ఇక్కడ వసతి గదుల్లో బస చేసి సోమవారం స్వామివారిని దర్శించుకుంటారు. రాత్రి వేళ ఏదేని వైద్య సహాయం అవసరమైతే భక్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 24గంటలూ వైద్య సేవలుప్రభుత్వం చర్యలు తీసుకుని వైద్య సేవలను మరింత విస్తృత పరచాల్సిన అవసరం ఉంది.

# ఆర్ఎఫ్‌సీఎల్‌లో వారం రోజుల్లో ఉత్పత్తి పునరుద్ధరణ...

గంగాధర:ఏపీ, తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల్లోని రైతాంగానికి యూరియా కొరత నివారణలో కీలకపాత్ర పోషిస్తున్న రామగుండం ఎరువుల కర్మాగారంలో వార్షిక మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి. వారం రోజుల్లో యూరియా ఉత్పత్తిని పునరుద్ధరించాలనే ప్రణాళికతో అధికారులు ముందుకు సాగుతున్నారు. సాధారణంగా ఏటా నవంబరులో కర్మాగారంలో ఉత్పత్తి నిలిపివేసి అవసరమైన విభాగాల్లో మరమ్మతులు చేపడుతారు. రానున్న ఏడాదికాలంపాటు నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటారు. ఈసారి నెల ముందుగానే మరమ్మతులు మొదలు పెట్టారు. వార్షిక మరమ్మతుల ప్రణాళిక ప్రకారం ఈ నెల 23న కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించనున్నారు. 26న యూరియా ఉత్పత్తి ప్రారంభం కానుంది. దీనికి అనుగుణంగా యూరియాను తరలించేందుకు రైల్వే వ్యాగన్ల షెడ్యూలు సైతం రూపొందించారు. కేవలం 15 రోజుల్లోనే వార్షిక మరమ్మతులు పూర్తిచేసి కర్మాగారాన్ని ఉత్పత్తి దశలోకి ప్రవేశపెట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలోని మొదటి 6 నెలలు లక్ష్యానికి చేరువలో యూరియా ఉత్పత్తి కొనసాగగా.. సుమారుగా రూ.320 కోట్ల లాభాలను ఆర్జించినట్లుగా భావిస్తున్నారు. రామగుండం వార్షిక ఉత్పత్తి లక్ష్యం12.7 లక్షల మెట్రిక్ టన్నులు కాగా.. రానున్న ఆరు నెలల్లో ఇంకా 6.35 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి కావాల్సి ఉంది. వరుసగా మూడేళ్లు లాభాలను ఆర్జించినట్లయితే సామాజిక బాధ్యతగా ప్రభావిత,



పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఆర్ఎఫ్‌సీఎల్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.గత రెండేళ్లు లాభాలు ఆర్జించిన ఎరువులకర్మాగారం ఈ ఆర్థిక సంవత్సరం సైతం లాభాల బాటలో పయనిస్తుండటంతో.. 2025-26 నుంచి సీఎస్సార్ నిధులతో ఈ ప్రాంతాభివృద్ధికి చర్యలు తీసుకోనుంది. ఈఆర్థిక సంవత్సరంలో గడిచినఆరు నెలల్లో 6.17 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో ఎరువుల కర్మాగారం లక్ష్యానికి చేరువలో నిలిచింది. మొదటి త్రైమాసికం(ఏప్రిల్, మే, జూన్)లో రూ.168 కోట్ల లాభాలు గడించినట్లుగా అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

# నిర్వహణ లోపం.. నీరే గరళం

## ట్యాంకులు శుభ్రపరచక కలుషితం

## వ్యాధులు ప్రబలుతున్నా చర్యలు కరవు

పెద్దపల్లి,తెలంగాణ దిశ :నెలలో మూడు సార్లు ట్యాంకులను శుభ్రం చేయాలనే నిబంధన లున్నా జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. పాత పథకాలు 352 ఉండగా మిషన్ భగీరథలో మరో 354 నిర్మించి సరఫరా చేస్తున్నారు. బ్లీచింగ్‌పౌడర్‌తో ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉండగా మొక్కుబడి తంతు కొనసాగిస్తున్నారు. ట్యాంకులకు పగుళ్లు ఏర్పడి లీకవుతున్నాయి. చాలా చోట్ల వాసన వస్తున్న నీటిని జనం తాగడం లేదు. మొత్తం 265 పంచాయతీల్లో 1,100 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. చెత్త తొలగింపు, మురుగుకాలువల శుభ్రతకే వీరు పరిమితమవుతున్నారు. రెండు నుంచి నాలుగు ట్యాంకులున్న పెద్ద పంచాయతీల్లో ఇబ్బందులు అధికంగా ఉంటున్నాయి. పంచాయతీలకు నెలల తరబడి నిధుల విడుదల లేక బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ట్యాంకు అడుగు భాగంలో బురద మండలకేంద్రంలో అయిదు బావులు, నాలుగు ట్యాంకులున్నాయి. మిషన్ భగీరథ జలాలు అందని బీసీ, ఎస్టీ కాలనీలకు ఊరకుంట చెరువు పక్కనున్న ట్యాంకు, బావి ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఎప్పుడో ఒకసారి ట్యాంకును చేస్తున్నారని బీసీ కాలనీవాసులు తెలిపారు. ట్యాంకు పల్లపు ప్రాంతంలో ఉండటంతో ఎప్పుడూ నీరు నిలిచే ఉంటోంది. అందులో పందులు పొర్లుతూ అపరిశుభ్రత నెలకొంది. పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా విషయమై బ్లీచింగ్, క్లోరినేషన్,



ట్యాంకుల శుద్ధి, బల్క్ వాటర్ సప్లై, లీకేజీలు, ఫిర్యాదులు, కొత్త కనెక్షన్ల పేరిట ఏడు రిజిస్టర్లు నిర్వహిస్తున్నారు. ట్యాంకును ప్రతి నెలా 1, 13, 21 తేదీల్లో శుద్ధి చేయిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ తెలిపారు. పెద్దపల్లి పురపాలికలో 9 ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. 45 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేస్తున్నట్లు చెబుతున్నా బోర్డులపై తేదీలు రాయడం లేదు. స్థానికంగా నీటి పరీక్షలు నిర్వహించడం లేదు. కేవలం ముర్మూర్‌లోని భగీరథ పంపింగ్ కేంద్రంలో మాత్రమే నిర్వహిస్తున్నారు. కుళాయి నుంచి సరఫరా ప్రారంభమైన కొద్దిసేపటివరకు నీరు మురికిగా వస్తోంది. పట్టణంలోని పైపులైను లీకేజీలు లేని వీధులు లేకపోవడం గమనార్హం.

# మోసం కొండంత.. వసూలు గోరంత!

# సవాలుగా జీఎస్టీ అక్రమాల కేసు




కరీంనగర్: జగిత్యాల కేంద్రంగా జరిగిన జీఎస్టీ మోసం కథ ఎటూ తేలడం లేదు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) పరిధిలోని ఐటీసీ (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) రూపంలో జరిగిన అక్రమ బాగోతం తాలూకు విచారణ ఇంకా నడుస్తూనే ఉంది. సుమారు 9 నెలల కిందట జగిత్యాలకు చెందిన జీఎస్టీ ప్రాక్టీషనర్ తప్పుడు ధ్రువపత్రాలతో బోగస్ సంస్థలను ఏర్పాటు చేసి దాదాపుగా రూ.288 కోట్ల ఆర్థిక మోసానికి పాల్పడ్డారని అధికారులు గుర్తించారు. కాగితాలపైనే సృష్టించిన పలు బోగస్ కంపెనీలకు ఆ సొమ్మును బదలాయించారు. ఈ అడ్డగోలు వ్యవహారాన్ని ఆలస్యంగా గుర్తించిన వాణిజ్య పన్నుల అధికారులు మొదట విస్తుపోయారు. తీరిగ్గా తేరుకుని బాధ్యుడిగా గుర్తించిన వ్యక్తి కార్యాలయంలో సోదాలు చేపట్టారు. పలు పత్రాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేసి అరెస్ట్ చేయించారు. తరువాత ఈ విచారణను హైదరాబాద్ నుంచి వచ్చిన వాణిజ్య పన్నుల శాఖ విజిలెన్స్ అధికారులు చేపట్టారు. తమ సంస్థలను మూసివేయమని జీఎస్టీ ప్రాక్టిషనర్ వద్దకు వచ్చిన కొందరు వ్యాపారుల ఆధార్ కార్డులను ఉపయోగించి ఆన్‌లైన్‌లో ఈ కుంభకోణానికి తెరతీసినట్లు విచారణలో గుర్తించారు. ఇలా 32 బోగస్ కంపెనీలను ఏర్పాటు చేసి సిమెంట్, ఐరన్ వ్యాపారాలు చేస్తున్నట్లు కాగితాల్లోనే నమ్మించాడు. ఆ బోగస్ సంస్థలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో జమ అయిన మొత్తం డబ్బులను 302 మంది వ్యాపారులకు బదిలీ అయినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. తెలంగాణలోని పలు ప్రాంతాలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన సంస్థలకు ఈ నగదు వెళ్లినట్లు గమనించారు. ఇందులో పెద్దమొత్తంలో ఒక సంస్థకు రూ.120 కోట్లు బదలాయింపు జరిగిన తీరు తెలుసుకుని అధికారులు నివ్వెరపోయారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఈ అక్రమంలో భాగమైన బాధ్యుడిని గుర్తించి పట్టుకున్నప్పటికీ.. పక్కదారి పట్టిన సొమ్మును తిరిగి వసూలు చేయడం అధికారులకు తలకు మించిన భారంగానే మారింది. ఇప్పటి వరకు గుర్తించిన పలువురు వ్యాపారులు, సంస్థల నుంచి రూ.13 కోట్లకుపైగా డబ్బును రాబట్టినట్లు తెలిసింది. మొత్తం మోసంలో ఇప్పటివరకు రికవరీ అయింది కేవలం 5 శాతమే. మూడు నెలల కిందటి వరకు రూ.11 కోట్లు రాగా.. ఇటీవల ఈ మొత్తం రూ.13 కోట్లను దాటినట్లు సమాచారం. జగిత్యాల కేంద్రంగా జరిగిన ఈ భారీ మోసాన్ని అప్పట్లో సవాలుగా తీసుకున్న అధికారులు కాలక్రమేణా ఇతర పనుల్లో తీరిక లేకుండా పోవడంతో విచారణలో దూకుడు ప్రదర్శించడం లేదన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా పోలీసులు, వాణిజ్య పన్నుల అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే ఇంకా ఇందులో భాగమైన వారెవరనేది బాహ్య ప్రపంచానికి తెలిసే అవకాశముంది.

పైగా రాష్ట్రంలోనే బోగస్ సంస్థలు ఏర్పాటు చేసి సొమ్మును బదలాయించినట్లు గుర్తించిన అధికారులు అందులో కొందరికి సర్‌ఛార్జ్ నోటీసులు అందించినట్లు తెలుస్తోంది. తరువాత రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టాన్ని ఉపయోగించి పోయిన నగదును తిరిగి చేజిక్కించుకునే విషయమై కసరత్తు చేసింది. పూర్తిస్థాయిలో మోసపోయిన సొమ్మును వసూలు చేయడం కష్టసాధ్యంగా ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఈ విషయమై వాణిజ్య పన్నుల శాఖ కరీంనగర్ డివిజన్ జాయింట్ కమిషనర్ రవికుమార్‌ను సంప్రదించగా రికవరీ ఎంత చేశారనేది ఈ కేసుని పర్యవేక్షిస్తున్న హైదరాబాద్‌లోని అధికారులకే తెలుస్తుందన్నారు.

# రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణంలో జాప్యం..?



మెట్‌పల్లి,తెలంగాణ దిశ : గూడు లేని పేదలకు సౌకర్యవంతమైన సొంతిళ్లు ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పథకం తీసుకొచ్చింది. లబ్ధిదారుల ఎంపిక పూర్తయి ఏళ్లు గడుస్తున్నా వారి సంఖ్యకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాల్లో ముందడుగు పడకపోవడంతో అర్హులకు నిరాశే ఎదురవుతోంది. ఇళ్లు పొందేందుకు అన్ని అర్హతలున్నా నిరీక్షణ తప్పడం లేదని పేదలు వాపోతున్నారు. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పురపాలికలతో పాటు మండలాల నుంచి రెండు పడక గదుల ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించి చాలా చోట్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. తొలి విడతలో ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు రూ.6.29 లక్షలు ఖర్చు చేయగా, రెండో విడతలో మాత్రం రూ.5.04 లక్షలు కేటాయించారు. జిల్లాకు మొత్తం 8,225 ఇళ్లు మంజూరవగా, 5,731 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 2,434 ఇళ్ల పనులు మొదలు కాలేదని తెలుస్తోంది. కాగా కొన్ని చోట్ల నిర్మాణాలు ప్రారంభించినా మధ్యలోనే నిలిచిపోయాయి. నిర్మాణ వ్యయం పెరగడం, బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో చాలా చోట్ల గుత్తేదారులు పనులను మధ్యలోనే వదిలేశారు. 305 ఇళ్లు ప్రగతిలో ఉండగా, అవి ఎప్పటికీ పూర్తవుతాయోనన్నది ప్రశ్నార్థకంగా మారింది.


జిల్లాలో కొన్నిచోట్ల లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించాల్సి ఉంది. అర్హులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించడంలో తాత్సారం జరుగుతోంది. కొన్నిచోట్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా సరిపడా ఇళ్లు నిర్మించక, పూర్తికాక ఎదురు చూపులు చూడాల్సి వస్తే, మరికొన్ని

చోట్ల ఇళ్లు పూర్తయినా అర్హుల ఎంపికలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 5,731 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా 4,653 మందికి కేటాయించా రు. ఇంకా మిగతా 1,078 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

# గుంటూరు కేంద్రంగా నకిలీ పురుగు మందులు

దామరచర్ల : ఏపీలోని గుంటూరు కేంద్రంగా పేరొందిన కంపెనీల పేరుతో తెలంగాణలో నకిలీ పురుగు మందుల సరఫరా జరుగుతున్నట్లు వ్యవసాయాధికారుల విచారణలో వెల్లడైంది. మిర్యాలగూడతో పాటు దామరచర్ల, అడవిదేవులపల్లి తదితర మండలాల పరిధిలో బ్రాండెడ్ కంపెనీ పేరుతో నకిలీవి రైతులకు విక్రయిస్తున్నారు.

దీనిపై ప్రముఖ సంస్థ కంపెనీ ప్రతినిధులు రెండ్రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో మొదట మిర్యాలగూడలోని ఓఫర్టిలైజర్స్, సీడ్స్ దుకాణంలో తనిఖీచేయగా ప్రముఖ కంపెనీపేరుతో గలనకిలీ పురుగు మందులు ఉన్నట్లు గుర్తించారు. రూ.52, 900 విలువైన 11కిలోల బరువుగల 23సాచెట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణదా రుడిని ప్రశ్నించగా.. ఓవ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించి డీలర్ నుంచి సరకు తమకు అందినట్లు తెలిపారు. సమాచారం ప్రకారం మండలంలోని వీర్లపాలెంలోని ఆగ్రోస్‌రైతు సేవా కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేయగా అక్కడా నకిలీవి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గుంటూరు నుంచి ధనావత్ రమేష్ ఈ ప్రాంతంలోని



పలు దుకాణాలకు నకిలీ మందులు సరఫరా చేస్తున్నట్లు ఓ దుకాణ యజమాని వివరించారు. డీఏవో మాట్లాడుతూ..

నకిలీవి విక్రయిస్తున్న దుకాణదారుల అనుమతులను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కంపెనీలకు సంబంధించిన ఇన్వాయిస్‌లను రైతులకు చూపించాలని, కొ నుగోలు బిల్లులు అందించాలని ఆదేశించారు

# చెన్నాపురం-గోరుకొండ మధ్యలో పేలిన మందుపాతర

చర్ల ,తెలంగాణ దిశ : చర్ల మండలంలోని చెన్నాపురం-గోరుకొండ మధ్యలో పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు డైరెక్షన్ మైన్(మందుపాతర)ను పేల్చారు. ఈ ఘటనలో స్పెషల్ పార్టీకి చెందిన ఓ పోలీసుకు స్వల్ప గాయాల య్యాయి. సీఐ రాజువర్మ నేతృత్వంలోని పోలీసు బృందం చర్ల మండల ంచెన్నాపురం బేస్ క్యాంపునకు వెళ్లి వెనుదిరిగారు. ఈక్రమంలో గోరుకొండకు సుమారు కి.మీ. పరిధిలోని అటవీ మార్గం లో మలుపు వద్ద అంబూష్ వేసిన మావోయిస్టులు ఒక్కసారిగా రహదారి పక్కన పెట్టిన డైరెక్షన్ మైన్‌ను పేల్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమ య్యారు. ఈ ఘటనలో స్పెషల్ పార్టీ పోలీసుకు స్వల్పగాయాలయ్యాయి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఈఘటనపై కేసు నమోదు చేసిదర్యాప్తు జరుపుతున్నామని సీఐ రాజువర్మ తెలిపారు. కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరానికి చెందిన మనోహర్, విజ యలక్ష్మి, సురేష్, వేణు, సునీత, భద్రాచలానికి చెందిన నాగసుధీర్, సారపాకకు చెందిన రామకృష్ణ, మరిపెడబంగ్లాకు



చెందిన విజయ్‌కుమార్, మహబూబాబాద్‌కు చెందిన రమేష్‌పై కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. కర్నూలుకు చెందిన వెంకన్న వద్ద వీరంతా మసాలాలు కొనుగోలు చేశారు. రూ.26,31,760 చెల్లించినట్లు నకిలీ బ్యాంకు చలాన్లు పంపి మోసగించారు. బాధితుడు ఈనెల 7న కర్నూలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# 3 రోజులు... 15 బెదిరింపు కాల్స్!

ముంబై: బాంబు పెట్టాం.. పేల్చిపారేస్తాం.. దమ్ముంటే కాపాడుకోండి..! అంటూ ఒక అజ్ఞాతవాసి నుంచి బెదిరింపు స్వరం. తీరాచూస్తే అంతా తూచ్. ఇదీ వరస. ఇంటర్నేషనల్, డొమెస్టిక్ ఫ్లైట్లన్న తేడా లేదు. ఉత్తుత్తి బెదిరింపులతో వేలాదిమంది ప్యాసింజర్లు బెంబేలెత్తిపోయారు. ప్రాణాలు గుప్పిట పట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి. అటు.. ఏవియేషన్ యంత్రాంగానిక్కూడా చుక్కలు కనిపించాయి.గత మూడు రోజుల్లోనే మొత్తం 15 బాంబ్ థ్రెట్స్ నమోదయ్యాయి.

బుధవారం.. ఈ ఒక్కరోజులోనే ఆరు విమానాలకు బాంబు బెదిరింపులొచ్చాయి. కాకపోతే అన్నీ ఫేకే..! అందరూ క్షేమం. మూడు ఇండిగో, రెండు స్పైస్‌జెట్.. ఒకటి ఆకాశ ఎయిర్.. మొత్తం ఆరు ప్లేన్లలో ప్రయాణికుల్ని బెంబేలెత్తించాయి బోగస్ ఫోన్‌కాల్స్.ఢిల్లీ నుంచి చికాగో వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం.. అగంతకుల బెదిరింపు కారణంగా దారిమళ్లి ంచాల్సి వచ్చింది.

సీక్రెట్‌గా ఒక రిమోట్ ఎయిర్‌పోర్ట్‌లో దింపి.. అందులోని 200 మంది ప్రయాణికుల్ని కాపాడారు. వీళ్లను ఎయిర్‌లిఫ్ట్ చేయడం కోసం..రాయల్ కెనడియన్ ఎయిర్‌ఫోర్స్‌కి చెందిన అఅ-330 యుద్ధ విమానాన్ని వాడారు.ఇటీవలే తిరుపతి విమానాశ్రయానికే బెదిరింపు లేఖ వచ్చింది. ఈ-మెయిల్ ద్వారా సీఐఎస్ఎఫ్ అధికార వెబ్‌సైట్‌కు పంపిన లేఖను గోప్యంగా ఉంచింది ఎయిర్‌పోర్టు

అథారిటీ. పోలీసులకు ఫిర్యాదు చేసి, ఈ-మెయిల్ ఆధారంగా నిందితుడ్ని పట్టుకునే ప్రయత్నం జరుగుతోంది.ఒకవైపు ప్యాసింజర్లకు అసౌకర్యం.. మరోవైపు ఫ్లయిట్ షెడ్యూల్స్ మార్చాల్సి రావడం..! ఫేక్ కాల్స్‌తో ఈ హైరానా పడలేకున్నాం అంటూ ప్రైవేట్ ఎయిర్‌లైన్ సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెరుగుతోంది.




## గుంతల దారికి సుంకం చెల్లించాలా?


కాటారం: జాతీయ రహదారుల నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం వివిధ ఏజెన్సీలకు దారి సుంకం వసూలు అప్పగిస్తోంది. 353(సీ) జాతీయ రహదారిపై మేడిపల్లి వద్ద వసూలు కేంద్రం(టోల్ ప్లాజా)

ఏర్పాటుచేశారు. కొద్ది రోజుల్లో దీన్ని ప్రారంభించబోతుండగా, ప్రస్తుతం ట్రయల్ రన్‌ని ర్వహిస్తున్నారు. ఏ వాహనానికి ఎంత టోల్ పన్ను వసూలు చేయాలనేది ఇప్పటికే నిర్ణయించారు. అయితే రహదారి నిర్వహణ అధ్వానంగా మారి, గుంతలు పడి ఇబ్బందులు పడుతున్నా..

దారి సుంకం చెల్లించాలా అని వాహనదారులు వాపోతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో ఈ దారి అక్కడక్కడా కుంగిపోగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిని మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

# విలువైన భూముల్లో అక్రమ కట్టడాలు

**గంగాధర,తెలంగాణ దిశ :** పట్టా భూములైనా, సర్కారు భూములైనా కబ్జాకు కాదేది అనర్హమంటూ ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. మారుమూల పల్లెల్లో సైతం గుంట స్థలం రూ.లక్షల్లో ధరలకు రెక్కలు రావడంతో ఇక వాణిజ్య స్థలాలను వదిలిపెట్టడంలేదు. ఇందుకు చెరువులు, కుంటల శిఖం భూములతోపాటు సాగునీటి కాలువలను సైతం కబ్జా చేస్తున్నారు. అక్రమ కట్టడాలకు పాల్పడుతుండగా అవి కాస్తా కుచించకపోయి వాటి ఉనికికే ప్రమాదం ఏర్పడింది.గంగాధర మండలం నారాయణపూర్ జలాశయం పరిధిలో మంగపేట ఎల్లమ్మ చెరువు నుంచి వేములవాడకు కుడి కాలువ 19 కి.మీ ఇప్పటికే పూర్తి చేశారు. కాలువ 60 మీటర్ల వెడల్పుతో నిర్మించగా కుడి వైపు దారికి 4 మీటర్లు, ఎడమ వైపు దారికి 6 మీటర్ల స్థలం వదిలిపెట్టారు. ఇక వాణిజ్య కేంద్రంగా ఉన్న గంగాధర ప్రధాన కూడలిలో మాత్రం 1.6 కి.మీ పొడవునా 45 మీటర్ల వెడల్పుతో ఇరువైపులా దారులకు స్థలం వదిలి కాలువ తవ్వారు. ఈ కాలువ పరిధిలో 12 డిస్ట్రిబ్యూటరీలు, వాటికింద ఉపకాలువల నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టారు. ఇక ర్యాలపల్లి వైపు ఎడమకాలువ 20.5 కి.మీ 40 మీటర్ల వెడల్పుతో పూర్తి చేయగా దానికింద 10 ఉపకాలువలు తవ్వారు. భూసేకరణ జరిపి బాధితులకు అప్పటికే నష్టపరిహారం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కాలువ పక్కనున్న భూములు పంటలకు అనువుగా ఉండి కొందరు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందిన గంగాధర ప్రధాన కూడలి (మధురానగర్ (గ్రామ పంచాయతీ)లో గుంట స్థలం కనీస ధర రూ.15 లక్షలు పలుకుతుండగా కబ్జారాయుళ్ల కన్నుపడింది. గంగాధర ప్రధాన కూడలి నుంచి కురిక్యాల రెవెన్యూ శివారు (పిట్టలపల్లి) వరకు 1.6 కి.మీ వాణిజ్య కేంద్రంగా ఉండి ఇక్కడి భూములకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండు ఉంది. కొందరు కాలువ పక్కనున్న దారులను వదిలిపెట్టకుండా ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారు. గతంలో కాలువ నిర్మాణం జరుగుతుందని తెలిసి కొందరు అక్రమ కట్టడాలతో నష్టపరిహారం పొందగా, మరికొందరు కాలువ తవ్వకం జరిగి దారులకు వదిలిపెట్టిన స్థలాలు ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టారు. ఇంకొందరు ఇదంతా తమదే స్థలమంటూ కాలువ భూములను అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటంతటికీ సాగు నీటిశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలు న్నాయి. కాలువ నిర్మాణానికి భూసేకరణ జరిపిన అధికారులు అప్పట్లోనే హద్దులు నిర్ణయించి కంచె వేస్తే విలువైన భూములు కబ్జాకు గురయ్యే అవకాశం



ఉండదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇప్పటికే ఎల్లంపల్లి పైపులైన్ల వెంట దారులతోపాటు పైపులైన్ల పైభాగాన్ని ఆక్రమించి పంటలు వేస్తుండగా పైపులైన్లకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి కాలువల భూములు కాపాడాల్సిన అవసరముంది. నిర్మాణ దశలో ఉన్న కాలువ భూములు ఎవరు ఆక్రమించినా సర్వే చేసి తొలగిస్తాం. కాలువకు కుడి వైపు ఆరు మీటర్లు, ఎడమ వైపు 7 మీటర్ల దూరంలో మురుగుకాలువలు నిర్మించి దారులు వేయాల్సి ఉంది. ఇప్పటికే భూసేకరణ జరిపి నష్టపరిహారం కూడా అందజేశాం. గతంలో నిర్మించిన వాటికి కూడా పరిహారం అందజేశాం.

# నిరుపేదల గుర్తింపులో తిరకాసు..?



**-పి-4 సర్వేలో లోపించిన పారదర్శకత**
**- బియ్యం కార్డులే ప్రామాణికం**
**- వలస కార్మికులకు జాబితాల్లో దక్కని చోటు**

గుంటూరు : పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పి-4 సర్వేలో పారదర్శకత లోపించింది. పేదల గుర్తింపునకు బియ్యం కార్డునే ప్రామాణికంగా తీసుకుంది. దీంతో, బియ్యం కార్డులేని వారికి, వలస కార్మికులకు, ఎటువంటి చేయూత లేదని వారికి జాబితాలో చోటు దక్కలేదు. రాష్ట్రంలో 20 నెలలుగా బియ్యం కార్డుల జారీ నిల్చిపోవడంతో పేదలైనప్పటికీ పి-4 సర్వేకు దూరమయ్యారు. .రేషన్ కార్డు ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి పింఛను పొందుతున్న వారిని, విద్యుత్ రాయితీ పొందుతున్న ఎస్సి, ఎస్టిలను ఈ సర్వేలో మినహాయించారు. నిరుపేద కుటుంబాలను గుర్తించి జిల్లాల నుంచి అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఈ కుటుంబాల వారిని బంగారు కుటుంబాలుగా ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో 1.40 కోట్ల కుటుంబాలకు బియ్యం కార్డులు ఉన్నాయి. వీటిలో 20 శాతం కుటుంబాలను నిరుపేదలుగా గుర్తించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీనికనుగుణంగా 29 లక్షల కుటుంబాలను గుర్తిం చినట్టు అధికార వర్గాలు తెలిపాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తే కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఎప్పటికప్పుడు తారుమారు అవుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ రంగంలో అవుట్ సోర్సింగ్ కార్మికులకు గరిష్టంగా రూ.15 వేలు వస్తుండడంతో గత ప్రభుత్వం వీరికి బియ్యం కార్డులు తొలగించింది. 60 ఏళ్లు నిండాక వీరు ఉద్యోగం కోల్పోతున్నా వారికి తిరిగి బియ్యం కార్డులు ఇవ్వడం లేదు. గత 20 నెలలుగా బియ్యం కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపో యింది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో వైసిపి ప్రభుత్వం 2021లో నవశకం సర్వే పేరుతో ఆరెంచెల విధానాన్ని అమలు చేసి 7.5 లక్షల కార్డులను రద్దు చేసింది. ఆ తరువాత దశల వారీగా కొన్నింటిని పునరుద్ధరించినా దాదాపు ఐదు లక్షల కుటుంబాల వారు తెల్ల రేషన్ కార్డుకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో ఈ కుటుంబాలన్నీ పి-4 సర్వేకు వెలుపలే ఉన్నాయి. బియ్యం కార్డులు ఉన్న వారిలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియో గాన్ని ప్రమాణికంగా తీసుకుని నిరుపేదలుగా పరిగణించి సంబంధిత జాబితాలను గ్రామ, వార్డు సచివాలయా లకు అధికారులు పంపినట్టు తెలుస్తోంది. ప్రభుత్వమే పేదరికంలో ఉన్న వారి జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాలకు పంపగా, సచివాలయాల ఉద్యోగులు వీరి వద్దకు వెళ్లి బయోమెట్రిక్ లేదా ఒటిపి ద్వారా వారు స్థానికంగా ఉ ంటున్నట్టు గుర్తించారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఎటువంటి వసతి, సరైన జీవనం లేనివారిని గుర్తించినట్టు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. విద్యుత్ వినియోగం 200 యూనిట్లలోపు ఉన్న వారిలో వారి కుటుంబంలో ఎవరికీ గణించదగ్గ ఆదాయం, ఆధార్ లింకుతోపరిశీలిస్తే ఎక్కడా ఎటువంటి ఆదాయం ఉన్నట్టు కన్పించని వారిని అధికారులే గుర్తించి సచివాల యాలకు పంపినట్టు తెలుస్తోం ది. కానీ, వీరి కన్నా అతి నిరుపేదలుగా ఉన్న వారు, కుటుంబాల్లో ఒంటరిగా ఉన్న వారు, పింఛన్లు లేని రిటైర్డు కార్మికులు, ఉద్యోగులు పి-4 సర్వేలోకి రాలేదు. వలస కార్మికులను అసలు పట్టించుకోలేదు. సచివాలయాల పరిధిలో మ్యాపింగ్ జరిగిన వారిని మాత్రమే గుర్తించారు. బీహార్, బెంగాల్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన వలస కార్మికులు భవన నిర్మాణ రంగంలో కీలక భూమిక పోషిస్తుంటారు. వీరికి రేషన్ కార్డులు లేకపోవడంతో వీరిని గుర్తించడం లేదు. ఇతర జిల్లాల నుంచి వస్తున్న వలస కార్మికులున్నారు. వీరిలో కొందరికి పి-4 జాబితాలో చోటు దక్కలేదు. పట్టణాల్లో ట్యాప్ కనెక్షన్లు, పక్కా నివాసం ఉన్న వారిని పేదలుగా పరిగణించ లేదు. నెలవారీ విద్యుత్ వినియోగం, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగంతోపాటు ఆదాయ పన్ను,జిఎస్‌టి రిటర్నులు, సొంత ఆస్తి, ఇల్లు, నాలుగు చక్రాల వాహనం, ఆదాయ మార్గాలు అద్దె, వడ్డీ, పింఛన్లు పొందుతున్న వివరాలను ముందే తెలుసుకున్న ఇందుకు సంబంధించిన వారి డేటాను పరిగణలోకి తీసుకోలేదు. నిరుపేదలు, అభాగ్యులు, ఎటువంటి చేయూతలేకుండా అన్న క్యాంటీన్లకు వస్తున్న అనేకమందిని కూడా ఈ జాబితాల్లోకి చోటు దక్కలేదు.

## పాపం.. గంగరాజు...!

## ఒక్కరితో పెళ్లికైనా అనుమతి ఇవ్వండి

**అనంతపురం, తెలంగాణ దిశ :** శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల మండలం గుమ్మయ్య గారి పల్లి కి చెందిన గంగరాజుకు కర్ణాటక రాష్ట్రం చిక్కబల్లాపూర్ కు చెందిన ఇద్దరు యువతులతో నిశ్చితార్థం జరిగింది. ఈనెల 10న గోరంట్లలో పెళ్లికి ముహూర్తం కూడా ఖరారు చేశారు. వారి వివాహానికి సంబంధించి పెళ్లి కార్డు సైతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇద్దరమ్మాయి లతో పెళ్లి..లక్కీ చాన్స్ కొట్టేసాడు అంటూ కామెంట్లు కూడా వచ్చాయి. సాధారణంగా వివాహంఅనేది ఒక యజ్ఞం లా మారిపోయింది. సరైన అమ్మాయి దొరకక చాలామంది అబ్బాయిలు సతమతమవుతుంటారు. పెళ్లి చేసుకునేందుకు చాలా రకాలుగా ఇబ్బంది పడుతుంటారు. సంబంధాలు చూస్తూ చూస్తూ చివరకు విసిగిపోయిన వారు ఉంటారు. కానీ ఓ యువకుడికి మాత్రం అరుదైన అవకాశం దక్కింది. అలా సృష్టించుకున్నాడు ఆయన ఆ అవకాశం. ఏకంగా ఇద్దరు యువతులతో పెళ్లికి రెడీ అయిపోయాడు. అయితే ఆ ఇద్దరు యువతులు కూడా అక్కాచెల్లెళ్లు కావడం మరీ విశేషం. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల మండలం గుమ్మయ్య గారి పల్లి కి చెందిన గంగరాజుకు కర్ణాటక రాష్ట్రం చిక్కబల్లాపూర్ కు చెందిన ఇద్దరు యువతులతో నిశ్చితార్థం జరిగింది. ఈనెల 10న గోరంట్లలో పెళ్లికి ముహూర్తం కూడా ఖరారు చేశారు. వారి వివాహానికి సంబంధించి పెళ్లి కార్డు సైతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇద్దరమ్మాయిలతో పెళ్లి.. లక్కీ చాన్స్ కొట్టేసాడు అంటూ కామెంట్లు కూడా వచ్చాయి. అయితే ఈ క్రమంలో సోషల్ మీడియా ద్వారాఈ విషయం పోలీసుల వరకు వెళ్ళింది. దీంతో పోలీసు విచారణలో అడ్డంగా బుక్కయ్యాడు సదరు వరుడు. ఆ ఇద్దరూ అక్కా చెల్లెళ్లు అని తేలగా.. మైనర్లు అని పోలీసులు గుర్తించారు. ఆ వివాహాలను నిలిపివేయించారు. సదరు యువకుడితో పాటు కుటుంబ సభ్యులను పిలిచి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లను వివాహం చేసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించా రు. దీంతో ఆ పెళ్లిని నిలిపివేశారు.అయితే ఈ ఇద్దరు యువతులు అక్కా చెల్లెళ్లు కావడం విశేషం. అందులో ఒకరికి పదహారేళ్లు , మరొకరికి 15 ఏళ్లు ఉన్నాయని తెలిసింది. వెంటనే అధికారులు ఇరువైపులా తల్లిదండ్రులను, కళ్యాణ మండపం నిర్వాహకుడిని పోలీస్ స్టేషన్ కు పిలిచి మాట్లాడారు. అయితే ఇద్దరితో కాకపోయినా.. ఒకరితోనైనా పెళ్లి చేసేందుకు అనుమతించాలని వారు కోరారు. కానీ ఇద్దరు మైనర్లు కావడంతో అధికారులు నిరాకరించారు. చిన్నపిల్లలకు వివాహాలు చేస్తే వచ్చే సమస్యలను వారికి వివరించారు. అయితే ఒక్క యువకుడికి ఇద్దరు అక్కచెల్లెళ్లను వివాహం జరిపించేందుకు సిద్ధపడడం వెనుక మతలబు ఏమిటో అర్థం కావడం లేదు. అయితే కేవలం వెడ్డింగ్ కార్డు వైరల్ కావడంతోనే ఈ పెళ్లి నిలిచిపోయింది. లేకుంటే సదరు యువకుడు పెళ్లి చేసుకోవడం? డ్యూయెట్లు పాడుకోవడం జరిగిపోయేది.

# రాజధానికి మరో 4285 కోట్లు



**విజయవాడ,తెలంగాణ దిశ :** ఏపీ రాజధాని అమరావతికి కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. రాజధాని నిర్మాణానికి రూ.4285 కోట్ల నిధులు విడుదల చేసింది. రాజధాని నిర్మాణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులు 25 శాతం విడుదల చేసింది. ఈ నిధులకు కేంద్రం వాటా రూ.750 కోట్లు కలిపి మొత్తం రూ.4285 కోట్లు ఇచ్చింది. అమరా వతిలో పనులు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో 25 శాతం నిధులు అడ్వాన్స్‌గా ఇవ్వాలని సీఆర్డీఏ కేంద్రాన్ని కోరింది. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా నిధులను విడుదల చేసింది.ప్రధా ని మోదీఏపీ రాజధాని అమరావతిలో పర్యటనకు ఏర్పాట్లు ప్రారం భమయ్యాయి. అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి ప్రధానిమోదీ ఏప్రిల్ మూడో వారంలో ఏపీకి రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని పర్యటన కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. ఈ కార్యక్రమానికి లక్షల్లో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా ఏర్పాట్లు చేస్తుంది. వెలగపూడి సచివాలయం సమీపంలో 250 ఎకరాల్లో భారీ బహి రంగ సభ నిర్వహించేందుకు పనులు ప్రారం భించారు. సామాన్య ప్రజలతో పాటు వీవీఐపీలు, వీఐపీల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సభాస్థలికి చేరుకునేందుకు మొత్తం 8 మార్గాలను గుర్తించారు.రాజధాని అమరావతి నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయి. అమరావతి నగరాన్ని రోడ్డు, రైలు, వాయు మా ర్గాల ద్వారా నేరుగా అనుసంధానిం చేలా, అత్యధునిక పరిజ్ఞానంతో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. అమరావ తిలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రైల్వేస్టేషన్‌ను నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. నెక్కల్లు-పెదపరిమి సమీపం లో దేశంలోకెల్లా అతిపెద్ద రైల్వేస్టేషన్‌ను నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో కోసం ఏపీ ప్రభుత్వం రైల్వేశాఖకు సుమారు 1500 ఎకరాలు అప్పగించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.అమరావతి రైల్వేలైన్‌ను రెండు దశలుగా చేపట్టాలని కేంద్ర రైల్వేశాఖ ఇటీవలనిర్ణయించిం ది. మొత్తం 56.53 కి.మీ. రైల్వేలైన్‌లో ఖమ్మంజిల్లా ఎర్రుపాలెం నుంచి 27 కి.మీ. లైన్‌ను మొదటి దశగా చేపట్టనున్నారు. ఈ రైల్వే లైన్ కోసం రెండు నెలల్లో టెండర్లను ఆహ్వానించనున్నారు. తొలి దశలోనే దాములూరు-వైకుంఠపురం మధ్య కృష్ణానదిపై 3.2 కి.మీ. మేర రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపడతారు. వచ్చే రెండు నెలల్లోగా భూసేకరణ పూర్తి చేయగలమ ని రైల్వే శాఖ ధీమా వ్యక్తం చేసింది. తొలిదశ పనుల కోసం సుమారు రూ.800 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. తాడికొండ మండలంలో రైల్వే లైన్ కోసం భూములిచ్చేందుకు కొందరు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో అక్కడ భూసేకరణ ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.అమరావతి రైల్వేస్టే షన్‌ను ఎయిర్ పోర్టు తరహాలో నగర శివారులో ఏర్పాటు చేయాల ని భావిస్తున్నారు. దేశంలోకెల్లా అతిపెద్ద మోడల్ రైల్వేస్టేషన్‌గా అత్యాధునిక సౌకర్యాలతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా దీనిని నిర్మించాలని సీఎం చంద్రబాబు కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.

## రద్దుకు తక్షణ నిర్ణయం..

# పునరుద్ధరణలో జాప్యం

**అనంతపురం, తెలంగాణ దిశ :** ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఏ మాత్రం చర్యలు లేవు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం అన్ని రైళ్లను రద్దు చేసిన విషయం విధితమే. తర్వాత దశల వారీగా రైళ్లను పట్టాలెక్కించారు. తొలుత రాజధాని రైళ్లు తర్వాత ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఆ తర్వాత ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించారు. ప్యాసింజర్ రైళ్లను మొన్నటి దాకా ప్రత్యేక ప్యాసింజర్లుగా నడపటంతో ఛార్జీలు ఎక్స్‌ప్రెస్ తరహాలో వసూలు చేశారు. వాటిని కూడా ఇటీవల సాధారణ ఛార్జీలుగా మార్పు చేశారు. ప్రయాణికులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఒకటి, రెండు రైళ్లు ఇప్పటికీ నడవక అనంత రైలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బెంగళూరు దండు-విజయవాడ ప్యాసింజర్ (53506/07) రైలు ఇప్పటికీ పునరుద్ధరించలేదు. కరోనా తర్వాత ప్యాసింజర్ రైలు మాత్రం నడవటం లేదు. తొలుత రైల్వే అధికారులు డబ్లింగ్ పనుల తర్వాత నడుపుతామన్నారు. ఆ తర్వాత ఆ రైలును మరచిపోయారు. ఈ రైలు ఉదయం 8 గంటలకు బెంగళూరులో బయలుదేరితే అనంతపురం, గుత్తి, గుంతకల్లు, డోన్, నంద్యాల మీదుగా విజయవాడకు ఉదయం 6 గంటలకు చేరుకునేది. అనంతపురం నుంచి విజయవాడకు వెళ్లే ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ రైలులోనే వారాంతాల్లో వెళ్లే వారు. ఎక్కువ ప్రయాణ సమయం ఉన్నప్పటికీ తక్కువ ధరతో విజయవాడకు తీసుకెళ్లే రైలు కావడం, జిల్లాలో పగటి వేళలో నడుస్తూ ప్రతి చిన్న రైల్వే స్టేషన్‌లోనూ ఆగుతూ వెళ్తుండటంతో గ్రామీణ ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు సాయంత్రం 7 గంటలకు విజయవాడలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.35 గంటలకు అనంతపురానికి చేరుకొని బెంగళూరు వెళ్లేది. దీంతో పగటి వేళలో బెంగళూరు వైపు వెళ్లే ప్రయాణికులకు అనుకూలంగా ఉండేది. ఈ సమయంలో ఇతర రైళ్లు లేకపోవడంతో విజయవాడ



ప్యాసింజర్‌కు డిమాండు కొనసాగుతూ వచ్చింది. అనంతపురం మీదుగా వారానికి ఒక రోజు మైసూర్- శిర్డి రైలు(16217/18) నడిచేది.ఈ రైలు మైసూర్ నుంచి శిర్డీకి వెళ్లి బుధవారం రాత్రి శిర్డీ నుంచి మైసూర్‌కు వెళుతుంది. జిల్లాకు చెందిన బాబా భక్తులు ఈ రైలులో శిర్డీ వెళ్లడానికి వీలుగా ఉండేది. కరోనా తర్వాత ఈ రైలును తుముకూరు, బళ్లారి మీదుగా శిర్డీకి వెళ్లేలా దారి మార్పు చేశారు. అప్పట్లో పార్లమెంటు సభ్యులు ఈ రైలు పట్టాలెక్కలేదని అడిగితే బెంగళూరు- గుత్తి డబ్లింగ్ జరుగుతుం డటంతో మార్పు చేశామని చెప్పారు. కానీ డబ్లింగ్ పనులు పూర్తి అవుతున్నాయి. అన్ని రైళ్లు అనంతపురం మీదుగా నడుస్తున్నా ఈ రైలు నడపడంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ రైలును తుమకూరు, బళ్లారి మీదుగానే శాశ్వతంగా నడుపుతామని ఇప్పటికే రైల్వే అధికారులు పరోక్షంగా చెబుతున్నారు. ప్రస్తుతం హిందూపురం, అనంతపురానికి చెందిన భక్తులు శిర్డీ వెళ్లడానికి కేవలం బెంగళూరు సిటీ- న్యూఢిల్లీ (12628-27) రైలు మాత్రమే ఉంది. ఈ రైలు కోపర్‌గావ్ దాకా వెళుతుంది. ఈ రైలులో సీట్లు దొరకాలంటే 4 నెలలు ముందుగా రిజర్వేషన్ చేయించుకోవాలి.

# ఇచ్చిన హామీలు అమలు చేయాలి..



**నర్సంపేట, తెలంగాణ దిశ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ పిలుపు నిచ్చాడు.నర్సంపేట పార్టీ కార్యాలయంలో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమం కరపత్ర ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యం ఇంటిట సౌభాగ్యం అంటూ తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు చేసిన వాగ్దానాలు పద్నాలుగు నెలలు గడుస్తున్న పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉందన్నాడు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగిలిన ఐదు గ్యారంటీలలో కొన్ని ఇంకా ప్రారంభమే కాలేదని, తెలంగాణ ప్రజల భవిష్యత్తుని బంగారు బాటలో నడిపిస్తామని గొప్పగా చెప్పిన మాటలన్నీ,నీటిమూటలుగా మారాయని విమర్శించాడు. కేసీఆర్ పాలనలో దగా పడిన తెలంగాణ రాష్ట్రాన్ని, ప్రజల ఆకాంక్షలకు అద్దం పటే విధంగా పాలిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ గత పాలకులు అడుగుజాడల్లో నడుస్తుందన్నారు. అధికారంలోకి రాగానే రైతు బంధు ఎకరానికి 15000 చెల్లిస్తామని,12 వేల రూపాయలు చెల్లిస్తామని ఆడిన మాట తప్పిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మంజూరు పారదర్శకంగా లేదన్నాడు.తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలోపే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న సర్కార్ 14 నెలల గడిచినప్పటికి 50 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నాడు.ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న నాలుగు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడంతో పాటు 40 లక్షల నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రంగాల్లో ఉపాధి హామీ కల్పించాలన్నారు. పోడు సాగు చేసుకుంటున్నటువంటి పదిలక్షల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆరు గ్యారెంటీలు ప్రకటించి కొనసాగించడంలో విఫలం చెందారని అన్నాడు.ప్రశ్నించే గొంతుకులను పరిరక్షిస్తామని.ఆరు నెలల కాలం కాకముందే దేశంలో పే ప్రొఫెసర్ జి హరగోపాల్, ప్రగశీల మహిళా సంఘం పిఒడబ్ల్యు సంధ్యతో పాటు వందలాది మంది విప్లవ సంస్థ నాయకులు,కార్యకర్తలపై కుట్ర కేసులు పెడుతున్నారని విమర్శిం చాడు.గత ప్రభుత్వాల వలె బూటకపు ఎన్కౌంటర్లు నిర్వహిస్తు, ములుగు జిల్లాలో ఎన్కౌంటర్ చేయడం జీవించే హక్కులు కాల రాయడం కాదాని విమర్శించాడు,ఈ నియంతృత్వ ఫాసిస్టు విధా నానికి స్వస్తి చెప్పాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నా రు.రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం హైదరా బాదులో తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్, ఏఐకే ఎంఎస్ జిల్లా నాయకులు బోగి సారంగపాని,డివిజన్ నాయకులు భద్రజీ,మల్లన్న,గుగులోత్ కిషన్ స్వామి పీ వై ఎల్ జిల్లా నాయకులు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు కొత్త ఎయిర్ పోర్టులు!

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** తెలంగాణలో ఎయిర్‌పోర్టులు చాలా తక్కువ. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో నాలుగు, ఐదు ఎయిర్‌పోర్టులు ఉంటే.. రాష్ట్రంలో మాత్రం హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఎక్కటే దిక్కు. బేగంపేట ఎయిర్‌పోర్టు వీఐపీల కోసం వినియోగిస్తుండగా.. వరంగల్ మామునూర్ ఎయిర్‌పోర్టు నిజాం కాలంలో సేవలందించేది. ప్రస్తుతం మాత్రం శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి మాత్రమే విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఎయిర్ పోర్టులు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కీలక ప్రకటన చేశారు. పొరుగు రాష్ట్రాల్లో బస్ డిపోల మాదిరిగా ప్రతి 150 కి.మీ ఎయిర్‌పోర్టులు ఉంటే తెలంగాణలో మాత్రం అందుబాటులో లేవని చెప్పారు. రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మించుకోవాల్సిన అవసరం ఉ ందని చెప్పారు. ఈ మేరకు వరంగల్ మామునూరు, కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఎయిర్ పోర్టులు నిర్మించాలని డిసైడ్ అయ్యారు. ఈ మేరుకు కేంద్రానికి ప్రతిపాదనలు సైతం పంపించారు.తాజాగా.. తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి. తాజా కేంద్ర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా... 120 కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని నాలుగు ప్రతిపాదిత ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి అడుగులు పడనున్నాయి. ప్రస్తుతం వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టుకు 696.14 ఎకరాల భూమి ఉంది.



ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు మరికొంత భూమి అవసరమని ంంఎ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీంతో 253 ఎకరాలను ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అదనంగా కేటాయింలు చేసింది. ఇక్కడ బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు అడుగులు పడే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.ఇక కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కూడా వేగంగా అడుగులు పడుతున్నాయి.

ఇక్కడ కూడా ప్రభుత్వ భూములు భారీగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మించనుండగా.. ఏఏఐ బృందం ఇప్పటికే ఫీజిబిలిటీ పరీక్షలను నిర్వహించింది. కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేస్తామని తాజాగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో వరంగల్ మామునూరు, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి ఈ ఏడాదిలోనే అడుగులు పడనున్నాయి.



## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. సెన్సెక్స్ 314 పాయింట్లు జంప్..!

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 314 పాయింట్లు పెరగ్గా.. నిఫ్టీ 95పాయింట్లకుపైగా పెరిగాయి. ఐటీ స్టాక్స్ రాణించడంతో పాటు ఈ నెల చివరలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించనుందనే అంచనాల మధ్య ర్యాలీ కొనసాగింది. సెన్సెక్స్ 81వేల పాయింట్ల ఎగువన ముగిసింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,129.69 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,927.97 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,181.37 పాయింట్లకు పెరిగింది. చివరకు 314.02 పాయింట్ల లాభంతో 81,101.32 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 0.39 శాతం పెరిగి 24,868.60 పాయింట్ల వద్ద ముగిసింది. వరుసగా ఐదోరోజు మార్కెట్లు లాభపడ్డాయి. భారత్‌లో ప్రముఖ ఐటీ సేవల సంస్థ అయిన ఇన్ఫోసిస్ ఈక్విటీ షేర్లను తిరిగి కొనుగోలు చేసే ప్రతిపాదనను బోర్డు పరిశీలిస్తుందని చెప్పడంతో 5.03 శాతం లాభపడింది. టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, బజాజ్ ఫిన్‌సర్వ్ లాభాలను ఆర్జించాయి. ట్రెంట్, ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ నష్టాల్లో ముగిశాయి.

## ధరలు తగ్గించిన మరిన్ని వాహన తయారీ కంపెనీలు

తగ్గిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్ల ప్రయోజనాలను వినియోగదారులకు అందించడానికి కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే పలు వాహన తయారీ కంపెనీలు తగ్గింపు ధరల వివరాలను ప్రకటించాయి. మంగళవారం మరిన్ని టూ-వీలర్, కార్ల తయారీ కంపెనీలు ధరల వివరాలను వెల్లడించాయి. అందులో ప్రముఖ బజాజ్ ఆటో జీఎస్టీ సంస్కరణల ఫలాలను పూర్తిగా వినియోగదారులకు బదిలీ చేస్తామని స్పష్టం చేసింది. పన్ను రేట్ల తగ్గింపు బజాజ్, కేటీఎం మోటార్‌సైకిళ్లు, స్కూటర్లపై రూ. 20,000, త్రీ-వీలర్లపై రూ. 24,000 వరకు తగ్గిస్తున్నట్టు తెలిపింది. మరో టూవీలర్ కంపెనీ యమహా సైతం అన్ని మోడళ్లపై రూ. 17,581 వరకు తగ్గిస్తున్నామని చెప్పింది. సవరించిన ధరల ప్రకారం, ఆర్15 మోటార్‌సైకిల్ రూ. 2.12 లక్షల నుంచి రూ. 1.94 లక్షలకు, రేజర్ బైక్ రూ. 7,759 తగ్గి రూ. 93,760కే అందుబాటులో ఉంటుందని కంపెనీ వివరించింది. తగ్గింపు ధరలను ప్రకటించాయి. హోండా కార్స్ ఇండియా తమ అన్ని కార్లపై రూ. 95,500 వరకు తగ్గించామని పేర్కొంది. కాంపాక్ట్ సెడాన్ అమేజ్ కారుపై రూ. 95,500, సిటీ కారుపై రూ. 57,500, ఎలివేట్ రూ. 58,400 వరకు తగ్గుతాయని వెల్లడించింది. మరో కంపెనీ జీప్ ఇండియా కూడా తమ కార్లపై మోడల్, వేరియంట్‌ని బట్టి రూ. 1.26 లక్షల నుంచి రూ. 4.8 లక్షల వరకు తగ్గుతాయని వెల్లడించింది. ప్రీమియం కార్ల కంపెనీ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) తన అన్ని మోడళ్లపై రూ. 4.5 లక్షల నుంచి రూ. 30.4 లక్షల వరకు తగ్గింపు అమలు చేస్తామని తెలిపింది.

# ఆపిల్ యూజర్లకు గుడ్‌న్యూస్..
# ఫోన్స్ 17 సిరీస్ లాంచ్..!

ఆపిల్ ఐఫోన్స్ ప్రియులకు గుడ్‌న్యూస్. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆపిల్ ఈవెంట్ నేడు జరుగబోతున్నది. కాలిఫోర్నియాలోని స్టీవ్ జాబ్స్ థియేటర్‌లో నేడు 'ఆవ్ డ్రాపింగ్' పేరుతో ఈవెంట్‌ను నిర్వహించబోతున్నది. స్థానిక కాలమానం ప్రకారం.. మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగనుండగా.. భారత కాలమానం ప్రకారం రాత్రి 10.30 గంటలకు జరుగనున్నది. ఈ ఈవెంట్‌ను ఆపిల్ వెబ్‌సైట్, యూట్యూబ్ ఛానల్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నది. ఈ ఈవెంట్‌లో ఐఫోన్ యూజర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐఫోన్ 17 సిరీస్‌ను ఆవిష్కరించబోతున్నది. అయితే, ఈ సారి డిజైన్‌లో భారీ మార్పులు ఉండనున్నట్లు పలు నివేదికలు వెల్లడించాయి. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొన్నది. ఈవెంట్ ఆపిల్ ఐఫోన్ నాలుగు కొత్త మోడల్స్‌ను లాంచ్ చేయనున్నది. ఇందులో ఐఫోన్ 17, ఐఫోన్ 17 ఎయిర్, ఐఫోన్ 17 ప్రో, ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ ఉన్నాయి. ఇందులో ఐఫోన్ 17 ఎయిర్ ప్రత్యేకంగా నిలువనున్నది. 5.5 మిల్లీమీటర్ల మందంతో ఐఫోన్స్‌లో ఇదే అత్యంత సన్నపాటి ఫోన్‌గా నిలువనున్నది. 6.6 అంగుళాల డిస్‌ప్లే, ప్రో మోషన్ టెక్నాలజీ, శక్తివంతమైన ఏ19 ప్రాసెసర్‌తో పాటు ఆపిల్ సొంతంగా తయారుచేసిన వై-ఫై చిప్‌పై పని చేయనున్నది. అయితే, ఇందులో ఫిజికల్ సిమ్ స్లాట్ మాత్రం ఉండదు. కేవలం ఈ-సిమ్ మాత్రమే పని చేయనుందని టాక్. ఈ ఫోన్ ధర సుమారు 900 డాలర్లుగా ఉండవచ్చని పలు నివేదికలు తెలిపాయి. ఇక ఐఫోన్ 17 బేస్ మోడల్‌లో సరికొత్తగా 120 ఎఛ ప్రో మోషన్ టెక్నాలజీతో ఏ19 ప్రాసెసర్‌తో పాటు 48మెగా పిక్సల్ మెయిన్ కెమెరాతో వస్తుంది. ఈ మోడల్ కనీస ధర 800 డాలర్లు అంటే భారతీయ కరెన్సీలో రూ. 70వేలకుపైగా



ఉండొచ్చని సమాచారం. ఇదిలా ఉండగా.. ఈ సారి ప్రో మోడల్స్‌ను పూర్తిగా మార్చేసినట్లు సమాచారం.
రియర్‌లో సెటప్‌ను అడ్డంగా మార్చేనట్టుగా తెలుస్తున్నది. టైటానియం బాడీకి బదులుగా అల్యూమినియం బాడీతో రానున్నట్లు సమాచారం. ఐ19 ప్రో ప్రాసెసర్, 48 వీూ టెలిఫొటో లెన్స్‌తో పాటు ఫ్రంట్, రియర్‌లో ఒకేసారి వీడియో రికార్డ్ చేసే వీలు కూడా కల్పించనున్నట్లు తెలుస్తున్నది. ప్రో మోడల్‌లో 6.3 అంగుళాలు, ప్రో మ్యాక్స్ 6.9 అంగుళాల డిస్‌ప్లేతో రానున్నది. ఆయా మోడల్స్ ధరలు వెయ్యి డాలర్లకుపైగా ఉండనున్నట్లు తెలుస్తున్నది. అలాగే, ఐఫోన్ 17 సిరీస్‌తో పాటు ఆపిల్ ఎయిర్‌పాడ్ ప్రో3, ఆపిల్ వాచ్ అల్ట్రా 3 సిరీస్‌తో పాటు ఆపిల్ వాచ్ ఎస్ఈ మోడల్‌ను ఆవిష్కరించనున్నది.




## పోస్టాఫీస్‌లో బంఫర్ స్కీమ్.. 12,500తో రూ.40 లక్షలు..

సొంతింటి కలను నిజం చేసుకోవాలనుకునే వారికి, బిడ్డ పెళ్లి చేయాలనుకునే వారికి, కొడుకు ఉన్నత చదువు కోసం డబ్బులు ఆదా చేయాలని చూసే వారికి గుడ్ న్యూస్. ఇక్కడ గుడ్ న్యూస్ అని ఎందుకు అంటున్నానుఅంటే కచ్చితంగా ఈ పొదుపు మీ దీర్ఘకాలిక అవసరాలను తీర్చగలదనే భరోసాను ఇవ్వగలదు. ఇందులో పొదుపు చేస్తే మీ డబ్బులకు 100గ్యారంటీ ఉంటుంది. ఎందుకంటే దీనికి కేంద్ర ప్రభుత్వం గ్యారంటీ ఉంది. ఇక్కడ మరోక విశేషం ఏమిటంటే ఈ మొత్తానికి పన్ను మినహాయింపు ఉంటుంది. ఇంతకీ ఈ పథకం ఏంటి, ప్రతి నెల ఎంత పొదుపు చేయాలని అనేది ఈ స్టోరీలో తెలుసు కుందాం.. రిస్క్ లేకుండా పెట్టుబడి పెట్టాలనుకునే వారికి, పన్ను ప్రయోజనాలు కోరుకునే వారికి, దీర్ఘకాలిక లక్ష్యాలు ఉన్నవారికి పోస్ట్ ఆఫీస్ పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ దీ బెస్ట్. పీపీఎఫ్ అనేది కేంద్రం సపోర్ట్‌తో నడిచే ఒక పొదుపు పథకం. మీకు తెలుసా ఈ పథకం ప్రస్తుతం 7.9 వార్షిక వడ్డీని అందిస్తుంది. ప్రతి నెలా రూ. 12,500 పీపీఎఫ్ ఖాతాలో పెట్టుబడి పెడితే.. ఏడాదికి మొత్తం రూ. 1.5 లక్షలు జమ అవుతాయి. ఈ పథకంమెచ్యూరిటీ వ్యవధి 15ఏళ్లు. మీరు ఈ 15 ఏళ్ల పాటు క్రమం తప్పకుండా పెట్టుబడి పెడితే మెచ్యూరిటీ సమయంలో మీకు దాదాపు రూ. 43.60 లక్షలు చేతికి వస్తాయి. ఇందులో రూ. 21 లక్షల పైగా వడ్డీ రూపంలోనే వస్తుంది. చిన్న మొత్తాలతో దీర్ఘకాలికంగా ఎక్కువ డబ్బు రావాలనుకునే వారికి పీపీఎఫ్ ఒక అద్భుతమైన ఆప్షన్. డిజిటల్ యుగం కాబట్టి ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లేదా డాక్ పే యాప్ ద్వారా పోస్ట్ ఆఫీసులో పీపీఎఫ్ ఖాతాను ఫోన్‌లో తెరుచుకోవచ్చు. ఇదంతా ఎందుకంటే దగ్గరలోని పోస్ట్ ఆఫీసులో పీపీఎఫ్ ఖాతాను తెరవాలి. తర్వాత ప్రతి నెల మీ బ్యాంక్ ఖాతా నుంచి పీపీఎఫ్ ఖాతాకు రూ. 12,500 ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలి. మెచ్యూరిటీ సమయంలో మీరు పన్నులు ఆదా చేసుకోవడమే కాకుండా మీ ఆర్థిక భవిష్యత్తును సురక్షితం చేసుకోవచ్చు. కేంద్రం హామీ ఇస్తుంది కాబట్టి పీపీఎఫ్‌లో డిపాజిట్ చేసే మొత్తం, వచ్చే వడ్డీ, మెచ్యూరిటీ మొత్తం అన్నీ పూర్తిగా పన్ను రహితం. ఇది ఆదాయపు పన్ను సెక్షన్ 80 జ కింద వర్తిస్తుంది. ఈ పథకం బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే ఎక్కువ వడ్డీ రేటును అందిస్తుంది. ఇక్కడ మరో వెసులుబాటు ఉంది.. ఒకేసారి లేదా నెలవారీ 12 వాయిదాలలో డబ్బును జమ చేయవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో ఖాతా తెరిచిన 3, 6 ఏళ్ల మధ్య మీ డిపాజిట్‌పై తక్కువ వడ్డీకి రుణం తీసుకోవచ్చు.

# చరిత్ర సృష్టించిన బంగారం..
# తొలిసారిగా తులానికి రూ.1.10లక్షలకు..!



బంగారం ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. ఇటీవల వరుసగా గతంలో ఎన్నడూ లేనివిధంగా ధరలు పెరుగుతున్నాయి. మరోసారి ధర భారీగా పెరిగి సరికొత్త గరిష్ఠానికి చేరింది. దేశీయ ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం రూ. 458 పెరిగి తొలిసారిగా తులానికి రూ. 1,10,047 పెరిగి చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పెరగడం, యూఎస్ డాలర్ బలహీనపడడం కారణంగా పసిడికి డిమాండ్ పెరిగింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో డిసెంబర్ డెలివరీకి సంబంధించిన గోల్డ్ ఫ్యూచర్స్ రూ. 458 (0.41శాతం) పెరిగి తులానికి రూ. 1,10,047కి చేరుకుంది. అక్టోబర్‌డెలివరీకి సంబంధించి 0.44శాతం పెరిగి తులానికి రూ. 1,09,000 రికార్డు స్థాయికి చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర పెరిగి కొత్త శిఖరాలను చేరాయి. యూఎస్ మార్కెట్ కామెక్స్‌లో డిసెంబర్ డెలివరీకి సంబంధించి గోల్డ్ ఔన్స్‌కు 3,694.75 డాలర్లకు చేరింది. ఇప్పటికీ వరకు ఇదే అత్యధికం. రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ జిగర్ త్రివేది మాట్లాడుతూ.. యూఎస్ డాలర్ బలహీనంగా ఉండడమే కారణమన్నారు.
ఈ ఏడాది వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని అంచనాలున్నాయి. వడ్డీ రేట్ల తగ్గింపు కారణంగా బంగారం డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. ఎందుకంటే బంగారం పెట్టుబడిదారులకు పసిడి మరింత ఆకర్షణీయంగా ఉంటుందని.. డాలర్ బలహీనపడడంతో బంగారానికి డిమాండ్ వస్తుంది. డాలర్ బలహీనపడిన సమయంలో ఇతర కరెన్సీల్లో బంగారం కొనడం చౌకగా ఉంటుందని,
అంతర్జాతీయంగా డిమాండ్ పెంచడంతో పాటు ధరలు పెరుగుతాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. వేగంగా పెరుగుతున్న ధరలు పెరుగుతుండడంతో పెట్టుబడిదారులు సైతం ఉత్సాహంగా ఉన్నారని మార్కెట్ నిపుణులు తెలిపారు. ముఖ్యంగా ఆర్థిక అనిశ్చితి పరిస్థితుల్లో బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తారని పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో బంగారం ధర పెరిగే అవకాశం ఉందని.. ఈ క్రమంలో దేశీయ మార్కెట్లో బంగారు ఆభరణాల ధరలు సైతం పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## ధరల తగ్గింపుపై నమ్మకం లేదు..




న్యూఢిల్లీ: జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా కంపెనీలు ధరలు తగ్గిస్తాయా అనేది అనుమానం కొనుగోలుదారుల్లో నెలకొన్నది. దీనిపై దేశవ్యాప్తం గా నిర్వహించిన సర్వేలో అత్యధిక మంది ఇదే అనుమానం వ్యక్తంచేశారు. జీఎస్టీ రేట్లను రెండింటికి కుదించడంతో నిత్యావసర వస్తువులతోపాటు ఇతర ఉత్పత్తుల ధరలు దిగిరానున్నాయి. కానీ ఆయా సంస్థలు ఈ ప్రయోజనాలను కొనుగోలుదారులకు బదలాయించే అవకాశాలు లేవని అత్యధిక మంది అభిప్రాయపడ్డారు. దేశీయంగా నిర్వహించిన సర్వేలో 42 శాతం మంది ఎటు చెప్పలేకపోగా, 33 శాతం మంది మాత్రం కంపెనీలు గరిష్ఠ రిటైల్ ధరను తగ్గిస్తాయా అనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వేలో 39 వేల మంది పాల్గొన్నారు. వీరిలో 61 మంది పురుషులు కాగా, 39 శాతం మంది మహిళలు.

# నష్టపరిహార సెస్సు.. రాష్ట్రాలను నిండా ముంచిన కేంద్రం..!



ఒకే దేశం.. ఒకే పన్ను అంటూ జీఎస్టీని తెచ్చిన మోదీ సర్కారు.. రాష్ట్రాల ఆదాయానికి గండికొట్టింది. రాష్ట్ర స్థాయిలో ఉన్న దాదాపు 10 పన్నులను ఎత్తివేయించి నష్టపరిహారం చెల్లిస్తామని మాయమాటలు చెప్పింది. నమ్మిన రాష్ట్రాలను నట్టేట ముంచి అప్పుల ఊబిలోకి నెట్టింది. సమాఖ్య రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కి రాష్ట్రాలపై తమ బలవంతపు విధానాలను రుద్దిన కేంద్రం.. అడుగడుగునా ఒంటెత్తు పోకడలనే అవలంబిస్తూ వస్తున్నది. ఫలితంగా అటు రాష్ట్ర, ఇటు దేశ ఆర్థిక వ్యవస్థలు ఛిన్నాభిన్నమైపోతు న్నాయి. న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)తో దేశ పరోక్ష పన్నుల వ్యవస్థ రూపురేఖలే మారిపోయాయి. అయితే ఈ ఒక్క పన్నుతోనే రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలూ కుదేలయ్యాయంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. రాష్ట్ర స్థాయిలోని 9 పన్నులను, జాతీయ స్థాయిలోని 8 పన్నులను మొత్తంగా 17 పన్నులను కలిపి మోదీ సర్కారు జీఎస్టీని తీసుకొచ్చింది. 2017 జూలై 1 నుంచి ఇది దేశవ్యాప్తంగా అమల్లోకి రాగా.. దీనివల్ల రాష్ట్రాలు కోల్పోయిన ఆదాయానికిగాను పరిహారం కూడా ఇస్తామని చెప్పింది. ఇలా వచ్చినదే జీఎస్టీ నష్టపరిహార సెస్సు. కానీ దీనివల్ల రాష్ట్రాలకు జరిగిన మేలు సంగతి దేవుడెరుగు.. కేంద్ర ప్రభుత్వానికి మాత్రం కాసుల పంటే పండింది. జీఎస్టీతో రాష్ట్రాలకు వాటిల్లుతున్న ఆదాయ లోటును భర్తీ చేసేందుకు నష్టపరిహార సెస్సును కేంద్ర ప్రభుత్వం తీసుకురాగా.. ఈ రెవిన్యూ లాస్ గణనకు 2015-16 ఆర్థిక సంవత్సరాన్ని బేస్ ఇయర్‌గా నిర్ధారించారు. ప్రతీ రాష్ట్రానికీ ఇదే వర్తిస్తుంది. ఈ క్రమంలోనే 2015-16లో జీఎస్టీలో విలీనం చేసిన 9 రాష్ట్ర స్థాయి పరోక్ష పన్నుల వార్షిక వృద్ధిరేటు ఆధారంగా నష్టపరిహార మొత్తాన్ని ఏటా 14 శాతంగా నిర్ణయించారు. ఐదేండ్లపాటు (2017 జూలై 1 నుంచి 2022 జూన్ 30 వరకు) నష్టపరిహార సెస్సును కొనసాగించాలని తీర్మానించారు. ఈలోగా జీఎస్టీ వసూళ్లు పెరిగి అంతా సర్దుకుంటుందన్నది కేంద్రం ఆలోచన. అయితే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ ఇటీవల విడుదల చేసిన అధ్యయనం ప్రకారం 2018-19 నుంచి 2023-24 మధ్య రాష్ట్రాల ఆదాయంపై జీఎస్టీ ప్రభావాన్ని మూల్యాంకనం చేస్తే.. దేశంలోని 18 ప్రధాన రాష్ట్రాల్లో 6 మాత్రమే ఒ క్కొక్క ఏడాది మెరుగైన ఆదాయాన్ని ఆర్జించగలిగాయి. 2018-19లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు బేస్‌లైన్ రెవిన్యూ షేర్‌ను అందుకున్నాయి. 2023-24లో కేవలం హర్యానానే దీన్ని సాధించింది. మహారాష్ట్ర మాత్రం 6 ఆర్థిక సంవత్సరాల్లో 2020-21 మినహా మిగతా 5 ఏండ్లు మెరుగైన ఆదాయాన్ని పొందింది. కరోనా, లాక్‌డౌన్‌ల దృష్ట్యా ఆ ఒక్క ఏడాది రాష్ట్ర ఆదాయం అనుకున్నంత స్థాయిలో రాలేదు. వచ్చిన నష్టపరిహారం కలిపినా ఈ 6 ఏండ్లలో 9 రాష్ట్రాలు ఒక్కోసారి బేస్‌లైన్ రెవిన్యూ షేర్‌ను సాధించలేకపోయాయి. 2 రాష్ట్రాలు రెండేండ్లు, 3 రాష్ట్రాలు మూడేండ్లు, 1 నాలుగుసార్లు బేస్‌లైన్ రెవిన్యూ షేర్‌ను అందుకోలేకపోయాయి. జీఎస్టీ నష్టపరిహారం చెల్లింపులపై కేంద్రం మాటమార్చిన నేపథ్యంలో రుణాల సమీకరణలో భాగంగా ఒక్కో రాష్ట్రం విడివిడిగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)ను సంప్రదించడం మొదలుపెట్టాయి. దీంతో పాలనాపరంగా సంక్లిష్ట పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో రాష్ట్రాల తరఫున ఆర్బీఐ నుంచి రూ. 2.7 లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వమే రుణంగా తీసుకున్నది. 2020-21లో రూ. 1.1 లక్షల కోట్లు, 2021-22లో రూ. 1.6 లక్షల కోట్ల రుణాలను పొందింది. అయితే ఈ అప్పులను రాష్ట్రాలే తీర్చాల్సి ఉంటుందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) చెప్పడం గమనార్హం. రూ. 6 లక్షల కోట్ల సెస్సు ఎక్కడ? కారణాలు ఏమైనా ఆర్బీఐ నుంచి తీసుకున్న అప్పులను తామే చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ మేరకు 2022 జూన్ 24న జీఎస్టీ చట్టంలో సవరణల్ని కూడా చేసింది. ఈ క్రమంలోనే 2026 మార్చి 31దాకా జీఎస్టీ నష్టపరిహార సెస్సును పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే 2023-24లో కొన్ని రాష్ట్రాలు జీఎస్టీ నష్టపరిహార బకాయిలను అందుకున్నాయి. అయితే సెస్సును పొడిగించి మూడున్నరేండ్లు గడిచినా ఆర్బీఐ నుంచి తెచ్చిన రూ. 2.7 లక్షల కోట్ల రుణాన్ని కేంద్రం పూర్తిగా తీర్చలేకపోయింది. మరోవైపు ఇదే సమయంలో జీఎస్టీ నష్టపరిహార సెస్సు ద్వారా కేంద్రం రూ. 6.1లక్షల కోట్లను వసూలు చేయడం గమనార్హం. బడ్జెట్ డాక్యుమెంట్లే సాక్ష్యం. మరి ఈ సొమ్మంతా ఏమైంది? అన్న ప్రశ్నకు సమాధానాలు మాత్రం లేవు. చివరగా.. జీఎస్టీ విధానంలో తాజా సవరణలతో.. మూలిగే నక్కమీద తాటిపండుపడ్డ చందంగా తయారైంది రాష్ట్రాల పరిస్థితి. ఇస్తామన్న నష్టపరిహారమే దిక్కులేక దిగాలుగా ఉన్న రాష్ట్రాలకు.. సగానికి తగ్గిన పన్ను రేట్ల స్లాబులతో ఆదాయం ఇంకా క్షీణిస్తున్నది మరి. ఈ క్రమంలోనే ఆగస్టు 29న దేశంలోని 8 బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఆర్థిక, రెవిన్యూ మంత్రులు.. జీఎస్టీ సవరణలతో వాటిల్లుతున్న నష్టాల మాటేమిటి అని కేంద్రాన్ని నిలదీశారు. అయితే ఎప్పట్లాగే మభ్యపెట్టిన కేంద్రం.. ఈ నెల (సెప్టెంబర్) 3న చేయాల్సింది చేసేసింది. ఏదిఏమైనా రాష్ట్రాలకు మాత్రం చట్టపరంగా ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండా అన్యాయమే చేస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయిప్పుడు. 2019 సెప్టెంబర్‌లో గోవాలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కేంద్రం ఒక్కసారిగా అడ్డం తిరిగింది. ఇకపై తాము జీఎస్టీ నష్టపరిహారాన్ని చెల్లించలేమని, ఆర్థికపరమైన ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నామని రాష్ట్రాల ప్రతినిధులకు తేల్చిచెప్పింది. అదే ఏడాది నవంబర్‌లో ఈ మేరకు ఓ అధికారిక ప్రకటనను కూడా విడుదల చేసింది. అప్పట్నుంచి అన్నిచోట్లా బహిరంగంగానే జీఎస్టీతో వాటిల్లుతున్న ఆదాయ నష్టాలను ఆయా మార్కెట్ల నుంచి రుణాలను సమీకరించి పూడ్చుకోవాలని మోదీ సర్కారు వ్యూహాత్మకంగా చెప్తూ వస్తున్నది. ఈ క్రమంలోనే నష్టపరిహారాన్ని ఎగ్గొట్టింది. తద్వారా జీఎస్టీ చట్టం-2017ను కేంద్రం ఉల్లంఘించినైట్టెంది. జీఎస్టీ అమలు సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'సహకార సమాఖ్య' అంటూ చేసిన వాగ్దానాలూ మంటగలిసిపోయాయి.

## రూ.1.13 లక్షలు.. మరో రికార్డుకు చేరుకున్న ధరలు




న్యూఢిల్లీ: బంగారం ధరలు చుక్కలనంటుతున్నాయి. రోజుకొక గరిష్ఠ స్థాయికి ఎగబాకుతున్న పుత్తడి ధర మరో ఉన్నత శిఖరాలను అధిగమించింది. దేశ రాజధాని నూఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల బంగారం ధర మరో రూ. 250 ఎగబాకి రూ. 1,13,000కి చేరుకున్నది. సెంట్రల్ బ్యాంకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం, డాలర్ బలహీనపడటం, అంతర్జాతీయంగా రాజకీయ అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతుండటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లిస్తుండటంతో వీటి ధరలు భారీగా పెరుగుతున్నాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. ఈ ఏడాది ఇప్పటి వరకు బంగారం ధర రూ. 34,050 లేదా 43.12 శాతం ఎగబాకింది. డిసెంబర్ 31, 2024న రూ. 78,950 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. రికార్డుస్థాయికి చేరుకున్న వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి రూ. 300 దిగి రూ. 1,28,500గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 3,657.09 డాలర్లు పలుకగా, వెండి 41.23 డాలర్లుగా నమోదైంది.

## రాణించిన ఐటీ, ఫైనాన్షియల్ షేర్లు.. - లాభాల్లో ముగిసిన మార్కెట్లు..!

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. ఐటీ, ఫైనాన్సియల్, రియాలిటీ షేర్లు రాణించాయి. ఆటో, మీడియా స్టాక్స్ లాభాల స్వీకరణకు దిగడంతో ఇంట్రాడేలో వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,504.36 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,235.42 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,643.88 పాయింట్ల వరకు చేరింది. చివరకు 323.83 పాయింట్ల లాభంతో 81,425.15 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 104.5 పాయింట్లు పెరిగి 24,973.10 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.7శాతం వరకు పెరిగాయి. నిఫ్టీలో భారత్ ఎలక్ట్రానిక్స్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్ లాభాలను ఆర్జించాయి. అయితే, ఎంఅండ్ఎం, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, మారుతి సుజుకీ, టాటా మోటార్స్ నష్టపోయాయి.



# కవర్ స్టిల్‌తో మంట పెట్టిన రకుల్



తెలుగు ప్రేక్షకులకు కెరటం సినిమాతో పరిచయం అయిన ముద్దుగు మ్మ రకుల్ ప్రీత్ సింగ్‌కి 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో హిట్ దక్కింది. సందీప్ కిషన్ హీరోగా నటించిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ కమర్షియల్‌గా భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో వెంటనే రకుల్ ప్రీత్ సింగ్‌కి టాలీవుడ్‌లో స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు దక్కాయి. మెల్ల మెల్లగా స్టార్ హీరోల సినిమాలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచిన రకుల్ ప్రీత్ సింగ్ ఐదేళ్ల పాటు వరుస సినిమాలు చేసింది. ఒకానొక సమయంలో స్టార్ హీరోల సినిమాలకు సైతం డేట్లు ఇవ్వలేని స్థాయిలో బిజీగా సినిమా లు చేసింది. కానీ కాలం ఎప్పుడూ ఒకలా ఉండదు కదా, తెలుగులో ఆఫర్లు తగ్గుతూ వచ్చాయి. టాలీవుడ్‌లో ఆఫర్లు తగ్గిన సమయంలో ఈ అమ్మడికి బాలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది. దేదే ప్యార్ సీక్వెల్‌తో ప్రేక్షకుల ముందుకు బాలీవుడ్‌లో ఈమె చేసిన సినిమాలు సైతం నిరాశను మిగిల్చాయి. ఒకటి రెండు తప్ప పెద్దగా సినిమాలు ఆమెకు గుర్తింపును తెచ్చి పెట్టలేదు. రెండు మూడు ఏళ్ల పాటు అక్కడ వరుస సినిమాలు చేసినా పెద్దగా గుర్తింపు రాలేదు. దాంతో అక్కడ కూడా ఆఫర్లు తగ్గుతూ వచ్చాయి. గత రెండేళ్లుగా రకుల్ ప్రీత్ సింగ్ సినిమాలు చాలా అరుదుగా వస్తున్నాయి. ఈ ఏడాది మేరే హస్బెండ్ కీ బివి సినిమాతో వచ్చింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. అయినా కూడా లక్కీగా రకుల్ కి దే దే ప్యార్ దే సినిమా సీక్వెల్ లో నటించే అవకాశం వచ్చింది. అప్పట్లో దే దే ప్యార్ దే మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అందుకే ఈ సినిమా లో ఆమెకు నటించే అవకాశం దక్కింది. ఈ సీక్వెల్ త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సినిమా విడుదల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బ్రైడ్స్ టుడే కవర్ పేజ్‌పై రకుల్ ప్రీత్ సింగ్ రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్ ఆరంభం నుంచి సినిమాలతోనే కాకుండా అందమైన ఫోటోలతోనూ ఆకట్టుకుంటూ వస్తోంది. తాజాగా మరోసారి ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా రకుల్ ప్రీత్ సింగ్ వార్తల్లో నిలిచింది. ఈసారి ప్రముఖ మ్యాగ జైన్ బ్రైడ్స్ టుడే కవర్ పేజ్ పై రకుల్ ప్రీత్ సింగ్ మెరిసిపోయింది. నడుము అందం చూపిస్తూ అందమైన నాభి అందాలను చూపించడం ద్వారా రకుల్ ప్రీత్ సింగ్ చూపు తిప్పనివ్వడం లేదు. ఆకట్టుకునే అందంతో పాటు, కన్నుల విందు చేసే విధంగా రకుల్ ప్రీత్ సింగ్ మేకోవర్ ఉంది....

## సల్మాన్ ఖాన్ బ్యాటిల్ ఆఫ్ గల్వాన్..

# ముంబై షెడ్యూల్ వాయిదా

భారత్, చైనా బోర్డర్‌లో అయిదేళ్ల క్రితం గల్వాన్‌లో ఘర్షణ చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఆరియల్ కథ ఆధారంగా బ్యాటిల్ ఆఫ్ గల్వాన్ చిత్రాన్ని తీస్తున్నారు. ఆ ఫిల్మ్‌లో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ నటిస్తున్నాడు. అయితే ఆ ఫిల్మ్ ముంబై షెడ్యూల్‌ను అర్థాంత రంగా ఆపేశారు. ఈ నెలలో ముంబైలో జరగాల్సిన షూటింగ్‌ను అకస్మాత్తుగా నిలిపేశారు. బాంద్రాలో ఉన్న మెహబూబ్ స్టూడియోలో వేసిన సెట్లను తొలగించేశారు. షూటింగ్‌ను రద్దు చేశారు. కొన్ని కారణాల వల్ల షూటింగ్‌ను నిలిపివేసినట్లు తెలుస్తోంది. అయితే ఈఫిల్మ్‌కు చెందిన మరో షెడ్యూల్‌ను లడాఖ్‌లో షూట్ చేయనున్నారు. ఆ షెడ్యూల్‌లో ఎక్కువగా యాక్షన్ సీన్స్‌పై దృష్టిపెట్టనున్నారు.ఫిల్మ్ నిర్మాణం విషయంలో రక్షణశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని సినీవర్గాలు పేర్కొన్నాయి. రక్షణశాఖ ఇచ్చిన పూర్తి పర్మిషన్‌తోనే షూటింగ్ ప్రారం భించినట్లు నిర్మాతలు చెబుతున్నారు. భారతీయ సైనికుల ధైర్యసాహసా లను ఆ ఫిల్మ్‌లో చూపించనున్నారు.

దేశాన్ని నెగటివ్‌గా చిత్రీకరించడం లేదని మేకర్స్ చెప్పారు. అనుమతులు లేకుండా నిర్మాత లు ఫిల్మ్‌ను ప్రకటిం చేవాళ్లు కాదు అని ఓ మీడియా కథనం పేర్కొన్నది. సల్మాన్ ఖాన్‌తో పాటు చిత్రాంగ ద సింగ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ ఫిల్మ్‌లో జెన్ షా, అంకుర్ భాటియా,హర్షిల్ షా,హీరా సోహల్,అ భిలాశ్ చౌదరీ,విపిన్ భరద్వాజ్ నటిస్తున్నారు.



2020 జూన్‌లో జరిగిన గల్వాన్ ఘర్షణ ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. లడాఖ్‌లోని గల్వాన్ లోయలో రెండు దేశాలకు చెందిన సైనికులు తీవ్రంగా కొట్టుకున్న విషయం తెలిసిందే. గన్స్ కాకుండా కేవలం రాళ్లు, ఇనుప కర్రెలతో సైనికులు ఫైట్ చేశారు.

# చిత్ర పరిశ్రమలో ఎవరి స్వార్థం వారిదే

## కిష్కింధపురి హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్




ఇండస్ట్రీలో మన అనుకునే వాళ్లు ఉండరని ఎవరి స్వార్థం వారిదని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. ఓ ఇంటర్వ్యూ లో సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు ఇండస్ట్రీలో స్నేహితులు లేరని తెలిపారు. నేను ఓపెన్‌గా ఉంటాను. మనసులో ఏదో పెట్టుకొని ఇలా మాట్లాడితే, ఆటిట్యూడ్ చూపిస్తే అభిమానులు పెరుగుతారేమోనని ఎప్పుడూ లెక్కలు వేసుకొని మాట్లాడలేదు. 'భైరవం' కంటే ముందు చాలా తక్కువగా మాట్లాడేవాడిని. ఈ మధ్య ఎక్కువగా మాట్లాడుతున్నాను. ఇండస్ట్రీకి వచ్చినప్పటి నుంచి ఒకేలా ఉన్నాను. మనసులో ఏదైనా ఉంటే నిద్రరాదు.. ఏవేవో ఆలోచనలు వస్తుంటాయి. అందుకే ఓపెన్‌గా ఉంటా. నేను ఎవరి విషయంలోనైనా బాధపడితే వా ళ్లకు మొహం మీదే చెప్పేస్తానని ఒప్పకున్నారు. ఇండస్ట్రీ లో ఎవరి స్వార్థం వాళ్లకు ఉంటుంది. మన అనే వాళ్ల ఎవరూ ఉండరు. ఇదొక సము ద్రం లాంటిది. లోతు ఎంత అనేది దీనిలో దిగిన వాళ్లకు మాత్ర మే తెలుస్తుం ది. ఇండస్ట్రీలో కూడా ఫ్రెండ్స్ ఉండి ఉండొచ్చు.. కానీ, బయట ఉన్నంత స్వచ్ఛంగా ఇక్కడ ఉండరు. మనతో బాగుంటారు.. మనం పక్కకి వెళ్లగానే మన గురించి మరోలా మాట్లాడతారు. నేనెప్పుడూ ఎవరి గురించి తప్పగా మాట్లాడను. చిన్నప్పటి నుంచి అంతే. గాసిప్స్ కూడా విననని అన్నారు. ప్రేక్షకులు థియేటర్‌కి రావడం లేదనేది చాలా మంది చెబుతున్న మాట. కానీ, మంచి సినిమా అయితే కచ్చితంగా వస్తారని నేనెప్పుడూ నమ్ముతా. ఓ మంచి కథతోనే మా 'కిష్కింధపురి' తెరకెక్కింది. ఆద్యంతం ఈ చిత్రం థ్రిల్‌ని పంచుతుంది. దర్శకుడు కౌశిక్ పెగల్లపాటి అద్భుతమైన కథని రాసుకుని తెరపైకి తీసుకొచ్చారు. థియేటర్లో ఫోన్ చూసుకునే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా ఈ సినిమా థ్రిల్‌ని పంచుతు ంది. సంగీతం, విజువల్ ఎఫెక్ట్స్ ఈ సినిమాకి చాలా ముఖ్యం అన్నారు బెల్లంకొండ సాయిశ్రీనివాస్.

# సినిమా..

## లక్షలు వచ్చే సాఫ్ట్ వేర్ ఉద్యోగం.. అవన్నీ వదిలేసి

# బిగ్ బాస్ హౌజ్‌లోకి



బిగ్‌బాస్ తెలుగు సీజన్ 9 గ్రాండ్‌గా లాంచ్ అయింది. ఎప్పెడప్పుడా అనిఎదురు చూస్తున్న ఈ షో రసవత్తరంగా సాగింది. హోస్ట్ అక్కినేని నాగా ర్జున తన స్టైలిష్ ఎంట్రీతో సందడి చేశారు. ఓజీ సాంగ్‌తో స్టార్ట్ చేసి, 'సోనియా సోనియా' పాటతో ప్రేక్షకులను అలరించారు. ఇక ఆ తర్వాత ఒక్కొక్కరిని హౌజ్‌లోకి ప్రవేశపెట్టారు. మొదటిగా సీరియ ల్ నటి తనూజ గౌడ్, ఆ తరువాత ఆశా సైనీ హౌస్‌లోకి ప్రవేశించారు.అయితే ఈసీజన్‌కి ప్రత్యేకత ఏంటంటే సెలబ్రిటీలతో పాటు కామన్ మాన్‌లు కూడా హౌస్‌లోకి వచ్చారు. మొత్తం ఆరుగురు కామనర్లు బిగ్ బాస్ హౌస్‌లోకి ఎంట్రీ ఇవ్వగా వారిలో మొదటిగా 'దమ్ము' శ్రీజ ఎంట్రీ ఇచ్చింది.వైజాగ్‌కు చెందిన శ్రీజ ఒక ప్రముఖ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తోంది. కానీ బిగ్‌బాస్‌ను ఎంచుకోవడానికి, లక్షల్లో జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేసింది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో మంచి ఫాలోయింగ్ ఉంది. ఆమె రీల్స్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది.బిగ్ బాస్ కోసం జాబ్ వదిలేసి హౌజ్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పుడు బిగ్ బాస్ హౌస్‌లో ఆమె ఎలా ఆడుతుందో, ఇతర కంటెస్టెంట్లతో ఎలా మెలుగుతుందో చూడటానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తు న్నారు. శ్రీజ అభిమానులు మాత్రం, ఆమె తన పేరుకు తగ్గట్టే హౌస్‌లో 'దమ్ము' చూపిస్తుందని నమ్ముతున్నారు. బిగ్‌బాస్ హౌస్‌లోకి ఎంట్రీ పొందేందుకు నిర్వహించిన 'అగ్నిపరీక్ష' ఆడిషన్స్ సమయంలో శ్రీజ తన ప్రత్యేకమైన ప్రవర్తనతో జడ్జిలని ఆశ్చర్యానికి గురి చేసింది. అభిజిత్, బిందు మాధవి ఇద్దరూ ఆమెకు రెడ్ ఫ్లాగ్ ఇచ్చి "ఈమె అనర్హురాలు" అని అన్నారు. కాని జడ్జ్ నవదీప్ మాత్రం ఆమెకు ఒక అవకాశం ఇస్తూ గ్రీన్ ఫ్లాగ్ ఇచ్చారు, కానీ హోల్డ్‌లో ఉంచారు. ఆ ఒక్క అవకాశాన్ని శ్రీజ వాడుకుంది. అగ్నిపరీక్షలో జరిగిన ప్రతి టాస్క్‌లో ఆమె అత్యుత్తమంగా ప్రదర్శన చూపింది. ఆమె పోరాట పటిమని జడ్జిలు కూడా మెచ్చుకున్నారు. చివరికి ప్రేక్షకుల ఓటింగ్‌లో టాప్‌లో నిలిచి, ఆమె నేరుగా బిగ్‌బాస్ హౌస్‌లోకి ఎంట్రీ సాధించింది. ఇప్పుడు శ్రీజ బిగ్‌బాస్ హౌస్‌లో అడుగుపెట్టింది. మిగతా కంటెస్టెంట్ల మధ్య ఆమె ఎలా నిలబడుతుంది? ఆమె ఆట ఎలా ఉంటుంది? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

# కాంతార టీమ్‌లో వరుస మరణాలు..?!




కన్నడలో విడుదలై సూపర్ హిట్ సాధించినకాంతార చిత్రం ఆ తర్వాత దేశ వ్యాప్తంగా విడుదలై మంచి ఆదరణ దక్కించుకుంది. ఇప్పుడు ఈ మూవీకి ప్రీక్వెల్‌గా కాంతార చాప్టర్ 1 రూపొందుతుంది. ఈ మూవీ చుట్టూ ఎన్నో రహస్యాలు, అపోహలు తిరుగుతున్నాయి. పౌరాణిక శక్తులనేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై దాగిఉన్న శక్తులు అడ్డుపడుతున్నాయనే ప్రచారం జోరుగా నడుస్తోంది. ముఖ్యం గా చిత్రబృందంలోని కొందరి మరణాలు, సెట్స్‌లో జరుగుతున్న ప్రమాదాలు ఈ ప్రచారానికి బలం చేకూర్చాయి. ఇప్పటివరకు ఈసినిమా టీమ్‌లో నలుగురు సభ్యులు మృతిచెందడంతో పాటు, ఇటీ వల చిత్రంలో కనిపించిన దున్నపోతు కూడా మృతి చెందడం వల్ల ఈ విషయాలు మరింత చర్చనీయాంశంగా మారాయి. మీడియా కూడా ఈ కథనాలను హైలైట్ చేస్తోంది.దీంతో, కాంతార టీమ్‌ను ఏదో దుష్టశక్తి వెంటాడుతోందా? అనే సందేహాలు ప్రజల్లో రేకెత్తుతున్నా యి. అయితే ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి దీనిపై ఎలాంటి అధికారిక స్పందన రాకపోవడంతో అపోహలు మరింత పెరిగాయి. ఎట్టకేలకి చిత్ర నిర్మాత చలువే గౌడ తాజాగా ఈ విషయంపై స్పంది స్తూ .. "మా సినిమాపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. కొన్ని తప్పుడు కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. వాస్తవానికి, కొన్ని ప్రమా దాలు నిజమే అయినా, ఎవరికీ పెద్ద నష్టం జరగలేదు. 2025లో ఒకసారి సెట్లో అగ్నిప్రమాదం జరిగింది. కానీ అందరూ సురక్షితంగా బయటపడ్డారు.

అదే సమయంలో, ఒక నదిలో పడవ మునిగిన ఘటనలో కెమెరాలు, పరికరాలు మాత్రమే నష్టపోయాయి. ప్రాణ నష్టం లేదు. దయచేసి అసత్యాలను ప్రచారం చేయొద్దు అని క్లారిటీ ఇచ్చారు.

అలాగే, సినిమా చిత్రీకరణకు ముందు పంజుర్లి అమ్మవారిని దర్శించుకున్నామని, ఆమె దివ్యదర్శనంలో కొన్ని అడ్డంకులు వచ్చినా, చిత్రీకరణ విజయవంతంగా పూర్తవుతుందని చెప్పారని అన్నారు.

రోజూతెల్లవారు ఝామున 4గం.లకు లేచి, 6గం.లకు షూటింగ్ మొదలు పెట్టేవాళ్లం. మధ్యలో విమర్శలు ఎదురైనా,ఇప్పుడు ఫుటేజ్ చూసి చాలా సంతృప్తిగా ఉంది అని కూడా వెల్లడించారు. ఈమూవీని అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్లాన్ చేస్తున్నారు.

## ఓటీటీలోకి హాలీవుడ్ మూవీ

# 'సూపర్‌మ్యాన్'.. స్ట్రీమింగ్..!



డీసీ యూనివర్స్‌లో భాగంగా వచ్చి హాలీవుడ్‌లో జులై 11న విడుదలైన బ్లాక్ బస్టర్ అందుకున్న 'సూపర్‌మ్యాన్' (2025) చిత్రం ఇప్పుడు ఓటీటీలోకి రాబోతుంది. ఈ సినిమా దర్శకుడు జేమ్స్ గన్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో వెల్లడించారు. ఈ సినిమా ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రముఖ ఓటీటీ వేదికలైన అమెజాన్ ప్రైమ్ వీడియో, యాపిల్ టీవీ, ఫాండాంగో ఎట్ హోమ్ వంటి ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు జేమ్స్ గన్ వెల్లడించారు.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సూపర్‌మ్యాన్ (డేవిడ్ కోరెన్స్‌వెట్) తన సొంత గ్రహం అయిన క్రిప్టాన్‌ను అలాగే తన కుటుంబాన్ని కాపాడుకోలేకపోయాను అన్న పశ్చాత్తాపంతో బాధపడుతుంటాడు. దీంతో భూమి మీదకి వచ్చి ఒక కుటుంబానికి దగ్గరై వారితో తన తన అస్తిత్వాన్ని ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తుంటాడు. మరోవైపు, పారిశ్రామికవేత్త అయిన లెక్స్ లూథర్ (నికలస్ హోల్ట్), సూపర్‌మ్యాన్ వలన భూమికి ముప్పు అని భావించి, అతన్ని అంతం చేయాలని కుట్ర పన్నుతాడు. హ్యామర్ ఆఫ్ బోరేవియా అనే పవర్‌ఫుల్ ఆయుధాన్ని సృష్టించి, ప్రజల్లో సూపర్‌మ్యాన్‌పై ద్వేషాన్ని పెంచుతాడు. ఈ పరిస్థితులలో, సూపర్‌మ్యాన్ తన విశ్వసనీయతను ఎలా నిరూపించుకున్నాడు? లెక్స్ లూథర్ చర్యలను ఎలా అడ్డుకున్నాడు? ఈ ప్రయాణంలో అతను ఎదుర్కొన్న సవాళ్లు ఏమిటి? అతని ప్రేమికురాలు లొయిస్ లేన్ (రెచెల్) ఇతర సూపర్ హీరోస్ అతనికి ఎలా సహాయం చేశారు? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215